# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

గురువారం | 24 సెప్టెంబరు, 2026 | పేజీలు : 08


## ఆరోగ్య పరిరక్షణలో 'ఆయుర్వేదం' కీలకపాత్ర



వివరాలు మెయిన్‌లో...

## గణనాథునికి ఘనంగా వీడ్కోలు



**ప్రజాపక్షం/హనుమకొండ :** వరంగల్‌లోని చిన్న వడ్డేపల్లి చెరువులో వినాయక నిమజ్జనోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి.గణనాథుడి నిమజ్జన కార్యక్రమాన్ని కుడా ఛైర్‌పర్సన్ గుండు సుధారాణి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత కొబ్బరికాయలు కొట్టి లాంఛనంగా ప్రారంభించారు.భక్తులు తీసుకువచ్చిన గణపతి విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేశారు.క్రేన్ సహాయంతో కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి, కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, డీసీపీ కవిత చెరువులో ఏర్పాటు చేసిన నీటితెప్పలపై దిగి విగ్రహాలను స్వయం గా నిమజ్జనం చేయడంతో పాటు....నిమజ్జన ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా కుడా ఛైర్‌పర్సన్ గుండు సుధారాణి మాట్లాడుతూ... చిన్న వడ్డేపల్లి చెరువు వద్ద గణేష్ నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయడం జరిగిందన్నారు. చిన్న వడ్డేపల్లి చెరువుకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 2500 విగ్రహాలు నిమజ్జనానికి రానున్నాయని పేర్కొన్నారు. దీనితో పాటు కుడా పరిధిలో ఉన్న అన్నీ నిమజ్జన పాయింట్ ల వద్ద అధికారులు తగు ఏర్పాట్లు చేసారన్నారు.వినాయక నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు విధులు నిర్వహిస్తున్న పోలీస్, రెవిన్యూ, నగరపాలక సంస్థ, కుడా,విద్యుత్, ఇరిగేషన్, మత్స్య శాఖ, ఆర్ అండ్ బి, ఫైర్ తదితర అన్నీ శాఖల అధికారులను కుడా చైర్ పర్సన్ అభినందించారు వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా వివిధ ప్రాంతాల్లో ప్రతిష్టించిన గణనాథుల విగ్రహాలను భక్తులు ప్రత్యేక వాయిద్యాల నడుమ తయారు చేసిన తెప్పల్లో చెరువు నీటిలో నిమజ్జనం చేశారు. వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా అధికారులు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశారు. నిమజ్జన ప్రాంతంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్యం, తాగునీరు తదితర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించారు.భక్తులు ప్రశాంత వాతావరణంలో గణనాథుడి నిమజ్జన వేడుకలను నిర్వహించుకునేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## విద్యాప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు కంప్యూటర్ విద్య, పరిశుభ్రత, విద్యాప్రమాణాల పెంపుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను, ఉపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం మండలంలోని పోచన్నపేట గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి పాఠశాలలోని విద్యాబోధన, మౌళిక వసతులు, పరిశుభ్రత, మధ్యాహ్న భోజన ఏర్పాట్లను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో పరిశుభ్రతను పరిశీలించిన ఆయన పరిసరాలను ఎప్పటికపుడు శుభ్రంగా ఉంచాలని పంచాయితి కార్యదర్శిని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని కట్టెల పొయ్యిని వినియోగించకుండా గ్యాస్‌పై మాత్రమే వంట చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించడంతోపాటు వారి హాజరు, క్రమశిక్షణ, పరిశుభ్రతపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఫిరోజ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అమృత, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గోదాముకు శంకుస్థాపన



### ఆరు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశం

**ప్రజాపక్షం/తాడ్వాయి :** మండలంలోని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో రూ.7 కోట్ల అంచనా వ్యయంతో పదివేల మేట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాము నిర్మాణానికి ఐటీడిఏ ప్రాజెక్ట్ అధికారి లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క భూమి పూజ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గోదాములు లేక రైతులు ధాన్యం రోడ్లపై ఆరబోస్తూ, అకాల వర్షాలతో నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఈ కష్టాలను తప్పించేందుకే నిల్వ సామర్థ్యాన్ని పెం చుతున్నామని, మండలంలో మరో గోదాం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. వచ్చే వర్షాకాలం నాటికి అందుబాటులోకి తేచ్చెలా, నాణ్యతా ప్రమాణాలతో ఆరు నెలల్లోగా పూర్తి చేసెలా అధికారులకు, గుత్తేదారులకు ఆదేశాలు ఇచ్చారు.

### రూ.50 కోట్లతో గిరిజన ప్రాంతాల అభివృద్ధి

గిరిజన ఆవాసాలు, ఎస్సీ కాలనీల్లో మౌళిక వసతులే లక్ష్యంగా పనులు చేపడుతున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. గిరిజన గూడాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.50 కోట్లు మంజూరు చేశామన్నారు. విద్యుత్ సౌకర్యం లేని మారుమూల గ్రామాలకు పర్యావరణానికి ముప్పు లేకుండా 10రోజుల్లో టెండర్లు పిలిచి సౌర విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని చెప్పారు. మహిళా సంఘాలు ముందుకొస్తే ఐదు నుండి పది ఎకరాల్లో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రోత్సాహం అందిస్తామని తద్వారా 5 లక్షల వరకు ఆదాయం సమకూరుతుందని పెర్కొన్నారు. ఉపాది హామీ పథకం ద్వారా ప్రతీ పంచాయతీకి రూ.50లక్షల విలువైన ప్రజాప్రయోజన ప్రజాప్రతినిధులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ బానోత్ రవిచందర్, వ్యవసాయ కమీటీ చైర్‌పర్సన్ రేగా కళ్యాణి, పంచాయతీ రాజ్ డైరెక్టర్ సోమయ్య పాల్గోన్నారు.

## వెలికట్టలో 118 మందికి నోటీసులు

### 271 సర్వేనెంబర్ లోని భూమి పొందిన రైతులు వాటి సంబంధిత ఆధారాలు చూపించాలి



**ప్రజాపక్షం/కొండపాక :** కొండపాక మండలం వెలికట్ట శివారులోని 271 సర్వే నంబర్ లో గల ప్రభుత్వ భూమిని అధికారులు సర్వే చేపట్టిన విషయం తెలిసిందే. కాగా గతంలో ఈ భూమిని పొందిన వారికి అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. బుధవారం 118 మందికి నోటీసులు అందజేశారు.

ఎవరైతే ఈ సర్వే నెంబర్ భూమిలో ఉన్నారో వారి భూమికి సంబంధించిన ఆధారాలను చూపించాలని నోవదుసులు జారీ చేయడంతో సదరు రైతులు అధికారులకు తమ ఆధారాలను అందివ్వడంలో నిమగ్నమయ్యారు. ఆధారాలు చూపించిన వారి భూములకు అధికారులు హద్దులు నిర్ణయించారు. బుధవారం 45 ఎకరాల్లో పలువురు రైతుల భూమి హద్దులు ఏర్పాటు చేశారు. ఈ సర్వే నంబర్ లోని మొత్తం 327 ఎకరాల భూమి వివరాలు సేకరించి హద్దులు ఏర్పాటు చేయనున్నారు.

## వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేయాలి

### మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతి రాజు



**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లా కేంద్రంలో రేపు శుక్రవారం జరుగనున్న వినాయక నిమజ్జనం ఏర్పాట్లను మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతి రాజు గురువారం మున్సిపల్ అధికారులు, సిబ్బంది తో కలిసి కొంటూరు చెరువు వద్దకు చేరుకుని ఏర్పాట్లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. ఆమె వెంట నాయకులు ప్రవీణ్ కుమార్, బాల్ రాజుతో పాటు ఉన్నారు.

# ఘనంగా గణపతి నిమజ్జనం ఏర్పాట్లు



## హనుమకొండ, వరంగల్ పరిధిలోని పలు నిమజ్జన ప్రదేశాలలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/హనుమకొండ :** గణపతి విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయి అన్నారు. బుధవారం హనుమకొండ లోని బంధం చెరువు , సిద్దేశ్వర గుండం వద్ద గణపతి విగ్రహ నిమజ్జన ఏర్పాట్ల ప్రక్రియను క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువుల్లో క్రేన్ల సహాయంతో విగ్రహాలను నిమజ్జనం చేస్తుండగా జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా నిర్వహించేందుకు వివిధ శాఖల అధికారుల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. నిమజ్జనానికి వచ్చే విగ్రహాల సంఖ్య నీటి లభ్యత, విగ్రహాల ఎత్తు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని నిమజ్జన కేంద్రాల వద్ద ఏర్పాట్లను సిద్ధం చేశామని పేర్కొన్నారు.నీటి మట్టం ఉన్న దృష్ట్యా బంధం చెరువు, చిన్న వడ్డేపల్లి చెరువు, ఉర్సు చెరువులకు విగ్రహాలను మళ్లించేలా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా న్యూ శాయంపేటలోని కోట చెరువులో విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. నిమజ్జన ఏర్పాట్లలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్, ఫిషరీస్, పోలీస్, తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు. నిమజ్జన కేంద్రాల వద్ద విద్యుత్ దీపాల ఏర్పాటు, పారిశుద్ధ్య నిర్వహణ, రాకపోకలకు ఏర్పాట్లు, క్రేన్లు, బ్యారికేడింగ్, తదితర సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. నిమజ్జన కార్యక్రమం పర్యవేక్షించేందుకు అధికారులను, సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సజావుగా సాగే విధంగా చర్యలు చేపట్టామని, అందుకు సహకరించాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాలలోనూ పలుచోట్ల ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు.

# మట్టి గణపయ్య నిమజ్జన మహోత్సవం



**ప్రజాపక్షం/పాలకుర్తి:** పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝూన్సి రాజేందర్ రెడ్డిల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగాపర్యావరణ పరిరక్షణ సందేశాన్ని చాటుతూ ప్రతిష్ఠించిన శ్రీ మట్టి గనపయ్య నిమజ్జన కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులున్నారు. అదే విధంగా మండలంలోని అన్ని గ్రామాలలో గణేష్ పూజలు భక్తులు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించి ఊర చెరువులలో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య, సీఐ భరత్ సుమన్, ఎస్ఐ పవన్ కుమార్‌ల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

# అక్టోబర్ 2న కలెక్టరేట్ ముట్టడి

**ప్రజాపక్షం/పాలకుర్తి:** రాష్ట్రంలో మద్యపాన నిషేధాన్ని అలు చేయాలని అక్టోబర్ 2న చేపట్టే కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇంచార్జి సునీల్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలని మంద కృష్ణ మాదిగ ఆదేవాలతో మాదిగ మహిళ సమైక్య మహాజన మహిళా సమైక్య ఆధ్వర్యంలో అక్టోబర్ 2న కలెక్టరేట్ ముట్టడి చేపట్టబోతున్నామని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు యాదగిరి స్వామి, మండల అధ్యక్షుడు సోమచందర్, రాజశేఖర్, మహేష్, రామచంద్రు, బాబు, చిరంజీవి, సోమన్న, సమ్మన్న కుమార్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలుకు ప్రణాళికల ఏర్పాటు

## అడిషనల్ కలెక్టర్ అశోక్ కుమార్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ఖరీఫ్ 2026–27 సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుంచి వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, సంచాలకులు గోపి, మార్కెటింగ్ శాఖ సంచాలకులు రాహుల్ రాజ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఐడీఓసీ నుంచి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 170 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీటిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 123, ఐకేపీ ద్వారా 40, జీసీసీ ద్వారా 5 కేంద్రాలు ఉంటాయని చెప్పారు. సుమారు 1,05,400 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలకు కేటాయించిన టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తేమ కొలిచే యంత్రాలు, ఎలక్ట్రానిక్ కాంటాలు తదితర పరికరాలను ముందుగానే సిద్ధంగా ఉంచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పరికరాల వినియోగం, సంరక్షణపై నిర్వాహకులు బాధ్యత వహించాలని, నిర్లక్ష్యం వల్ల దెబ్బతిన్న పరికరాల నష్టాన్ని కమిషన్ నుంచి కోత విధించే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ స్పష్టం చేశారు. ముంపునకు గురయ్యే అవకాశమున్న 12 కొనుగోలు కేంద్రాలకు ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించాలని, ధాన్యం నిల్వకు ఫంక్షన్‌హాళ్లు, ప్రైవేటు గోదాములు, సీఏపీ స్థలాలను గుర్తించాలని అశోక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సుమారు 37.60 లక్షల గోనె సంచులు అవసరమవుతున్నందున వాటిని ముందుగానే సమకూర్చుకోవాలని సూచించారు. ధాన్యాన్ని నూర్పిడి అనంతరం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు ఆయన సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయ అధికారి బాబూరావు, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, డిఎం రాములు, సహకార అధికారి వాలియా నాయక్, తెలంగాణ రైతు విజ్ఞాన వేదిక శాస్త్ర వేత్త డా మదన్ మోహన్ రెడ్డి, అదనపు డిఆర్డీఓ చౌహన్, మహాదేవ పూర్ ఎడిఎ శ్రీపాల్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రెయిన్ స్ట్రోక్ చికిత్సలో ఆధునిక వైద్య సాంకేతికత

## న్యూరో ఫిజిషియన్ డాక్టర్ శివరాం రావు

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :**ఇటీవల స్ట్రోక్ చికిత్సలో మెకానికల్ థ్రాంబెక్టమీ ఒక విప్లవాత్మకమైన మార్పుగా మారిందని,మెదడుకు రక్తాన్ని సరఫరా చేసే ప్రధాన రక్తనాళంలో ఏర్పడిన రక్తం గడ్డను ప్రత్యేకమైన పరికరాల సహాయంతో క్యాథెటర్ ద్వారా తొలగించి, తిరిగి రక్తప్రసరణను పునరుద్ధరించే చికిత్స ఇది.యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్‌లో ఆధునిక బైప్లేన్ న్యూరోఇంటర్వెన్షనల్ క్యాథ్ ల్యాబ్ అందుబాటులో ఉందని, ఇందులో మెదడులోని రక్తనాళాలను రెండు కోణాల్లో ఒకేసారి స్పష్టంగా చూడగలగడం వల్ల క్లిష్టమైన న్యూరోఇంటర్వెన్షనల్ చికిత్సలను మరింత ఖచ్చితత్వంత నిర్వహించవచ్చని,అవసరమైన రోగులకు మెకానికల్ థ్రాంబెక్టమీ, కరోటిడ్ స్టెంటింగ్, మెదడు అన్యూరిజం చికిత్స వంటి ఆధునిక విధానాలను అందిస్తున్నామన్నారు.ప్రజలు బి ఫాస్ట్ లక్షణాలను గుర్తుంచుకోవాలి అకస్మాత్తుగా బ్యాలెన్స్ కోల్పోవడం, చూపు తగ్గడం, ముఖం వంగడం, చేయి,కాలు బలహీనపడటం, మాట తడబడటం.స్ట్రోక్ లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే స్ట్రోక్ సెంటర్‌కు తీసుకెళ్లడం అత్యంత ముఖ్యం చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలోఅసిస్టెంట్ మేనేజర్ యూ రాజకుమార్,స్వరాజ్ కుమార్ పాల్గొన్నారు.

# 28, 29, 30 తేదీలలో ఎఐకెఎంఎస్ జాతీయ మహాసభలు

## మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించిన రైతు కూలి సంఘం నాయకలు

**ప్రజాపక్షం/గూడూరు;**ఖమ్మం నగరంలో ఈనెల 28, 29 ,30 తేదీలలో నిర్వహించనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం (ఎఐకెఎంఎస్) 4 వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకులు గజ్జి లింగన్న కొట్టెం అచ్చన్న పిలుపునిచ్చారు.మండల కేంద్రంలోని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంతో పాటు గోవిందపురం మచ్చర్ల అప్పరాజుపల్లి జగనాయకుల గూడెం గ్రామాలలో మహాసభల ప్రచార వాల్ పోస్టర్లను బుధవారం వారు ఘనంగా ఆవిష్కరించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా రైతులు వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రంగా చర్చించి భవిష్యత్ ఉద్యమ పోరాట కార్యాచరణను రూపొందించేందకు ఈ జాతీయ మహాసభలు కీలక వేదికగా నిలవనున్నాయని తెలిపారు.కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక నల్ల చట్టాలను రైతులు కూలీలు ఐక్యంగా తిప్పికొట్టారనిఎఐకెఎంఎస్నిరంతరం రైతు హక్కుల కోసం రైతులు కూలీలు కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు.సెప్టెంబర్ 28 న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు మండలంలోని రైతులు వ్యవసాయ కూలీలు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. సంఘం నాయకులు కార్యకర్తలు పెనక భరత్ కొట్టెం బుజ్జన్న ఒర్రె వెంకన్న కాగబోయిన సర్సయ్య జోగ వీరస్వామి రమేష్ రాజు వెంకన్న లక్ష్మ య్య, సుజాత, లక్ష్మి, నర్సక్క తదితరులు పాల్గొన్నారు.

# బొట్ల శ్రీనివాస్ ఆయశాలను కొనసాగించాలి: మోకు కనకారెడ్డి

**ప్రజాపక్షం/ జనగామ :** కార్మిక ఉద్యమ నాయకుడు, మాజీ కౌన్సిలర్ బొట్ల శ్రీనివాస్ ఆయశాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం సిపిఎం కార్యాలయంలో పట్టణ కమిటి ఆధ్వర్యంలో బొట్ల శ్రీనివాస్ 2వ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమానికి మోకు కనకారెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. బొట్ల శ్రీనివాస్ మున్సిపల్ కౌన్సిలర్‌గా ప్రజా సమస్యల్ని పరిష్కరించడమే కాకుండా కార్మిక నాయకుడిగా కార్మికులు, కర్షకులు,ఉద్యోగుల సమస్యలపై ఆనేక పోరాటాలు చేశారన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యల కోసం నిరంతర పోరాటాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సాంబరాజు యాదగిరి, బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు పోత్కనూరి ఉపేందర్, ఎండి ఆజారుద్దీన్, సీనియర్ నాయకులు ఎండి దస్తగిరి, ఆర్ నిత్యనాయక్, కళ్యాణం లింగం, బాల్నె వెంకటమల్లయ్య, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో చేరిక



**ప్రజాపక్షం/లింగాలఘణపురం:** మండలంలోని జీడికల్ గ్రామ ఉప సర్పంచ్ గుండెబోయిన నరేష్ బుధవారం హన్మకొండ లోని స్టేషన్ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నివాసంలో వారు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆహ్వానించి కాంగ్రెస్ కండువా కప్పారు. నరేష్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి పనులను చూసి కాంగ్రెస్ పార్టీలో చేరానని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొండబోయిన మమత సంపత్, గ్రామ శాఖ అధ్యక్షులు దేవరాయ రాజు, గ్రామ ప్రధాన కార్యదర్శి కొండబోయిన నాగరాజు, ఇంద్రమ్మ కమిటీ సభ్యులు కొండబోయిన మహేష్ బీరం లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎంజిఎం ప్రక్షాళనకు సమగ్ర చర్యలు

## వినయ్‌భాస్కర్‌పై దాడిని ఖండించిన మాజీ ఎమ్మెల్యే నరేందర్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** ఎంజిఎం ఆసుపత్రి పర్యటన సందర్భంగా బిఆర్ఎస్ మాజీ ఎంఎల్ఏ దాస్యం వినయ్ భాస్కర్‌పై జరిగిన ఘటనను వరంగల్ తూర్పు మాజీ ఎంఎల్ఏ నన్నపనేని నరేందర్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఎంజిఎం ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను ప్రస్తావించారు. వినయ్‌భాస్కర్‌ను పోలీసులు అడ్డుకోవడం, తోపులాట జరగడం, ఆయనకు గాయాలు కావడంపై బిఆర్ఎస్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఎంజిఎంలో మందుల కొరత, అల్ట్రా సౌండ్ సేవలు అందుబాటులో లేకపోవడం ఎమర్జెన్సీ వార్డులో సమస్యలు, గుండె సంబంధిత వైద్యుల కొరత వంటి సమస్యలు ఉన్నాయని నరేందర్ ఆరోపించారు. ఆరోగ్యశ్రీలో అక్రమాలపై చర్యలు తీసుకవడం లేదని, ప్రయివేట్ వైద్య వ్యవస్థకు ప్రాధాన్యం పెరుగుతోందని విమర్శించారు. కలెక్టర్ తనిఖీ సమయంలో గైర్హాజరైన అధికారులపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. బిఆర్ఎస్ హయాంలో ఎంజిఎంలో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేశామని, ప్రస్తుతం దాని నిర్వహణపై దృష్టి లేదని అన్నారు. ఆసుపత్రిని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని, కొత్త ఆసుపత్రిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను ప్రతిపక్షంగా ప్రశ్నించే బాధ్యత బిఆర్ఎస్‌కు ఉందని నరేందర్ అన్నారు. ప్రజారోగ్యానికి సంబంధించిన సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు.

# జనగామ – జెబిఎస్ బస్సు పునరుద్ధరణకు హామీ

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** జనగామ డిపో నుంచి జేబీఎస్‌కు గతంలో నడిచిన బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలని కోరుతూ కొన్నె, లింగంపల్లి, మన్సాన్‌పల్లి, సాల్వాపూర్ గ్రామాల సర్పంచ్‌లు బుధవారం జనగామ డిపో మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే బచ్చన్నపేట నుంచి కొన్నె గ్రామం, కేశపూర్‌కు వెళ్లే బస్సును సాయంత్రం 6 గంటలకు బచ్చన్నపేట నుంచి బయల్దేరేలా సమయాన్ని మార్చాలని కోరారు. డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించి త్వరలో సమయ మార్పుతో జనగామ నుంచి జేబీఎస్‌కు బస్సు సర్వీసును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కోడూరు స్వర్ణలత శివకుమార్ గౌడ్, మద్దికుంట రాధ, గీస సందీప్, మిద్దెల శ్రీధర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# గంగమ్మ ఒడిలోకి చేరిన గణనాథుడు

### భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీస్‌లు

**ప్రజాపక్షం/కాళేశ్వరం;**జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం అంతర్ రాష్ట్ర వంతెన వద్ద గోదావరి తీరంలో బుధవారం వినాయక విగ్రహాల నిమజ్జనం వేడుకలు వైభవంగా కొనసాగాయి.గణపతి నవరాత్రి ఉత్సవాల సంధర్భంగా తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక మండపాలలో విశేష పూజలందుకున్న వినాయక విగ్రహాలను ఉమ్మడి వరంగల్ జిల్లా తదితర వివిధ ప్రాంతాల నుండి ప్రత్యేక వాహనాలలో భారీగా తరలించిన వినాయకులను కాళేశ్వరం గోదావరి నదిలో 'గణపతి పప్పా మోరియా' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ గణేశుని నిమజ్జనం వేడుకలు ఘనంగా నిర్వహించారు.వినాయక విగ్రహాల నిమజ్జనం సంధర్భంగా అంతర్ రాష్ట్ర వంతెనవద్ద గోదావరిలో నిమజ్జనం వేడుకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసారు.అంతర్ రాష్ట్ర వంతెన గోదావరి తీరం వద్ద వినాయక నిమజ్జనానికి నాలుగు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాండ్ల నుండి నాలుగు భారీ క్రేన్ల ద్వారా వినాయకుల విగ్రహాలను నిమజ్జనం చేసారు.రాత్రిళ్ళు కొనసాగిన నిమజ్జనం వేడుకల సంధర్భంగా పెద్ద ఎత్తున విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేసారు.కాటారం డిఎస్పీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో మహాదేవపూర్ సిఐ వెంకటేశ్వర్లు,కాళేశ్వరం ఎస్ఐ తమాశా రెడ్డి పర్యవేక్షణలో కాళేశ్వరం నుండి నిమజ్జనం ప్రాతం వరకు వినాయకుల తరలింపు మార్గంతో పాటు నిమజ్జనప్రాంతంలో భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసారు.గోదావరి తీరం నిమజ్జన ప్రాంతానికి సాయంత్రం వరకు అడపాదడపా చేరుకున్న వినాయకులు రాత్రి తొమ్మిది గంటల నుండి తెల్లవార్లు భారీగా తరలివచ్చిన వినాయక విగ్రహాల నిమజ్జనం వేడుకలు శోభాయమానంగా జరిగాయి.ఎలినినో కారణంగా అనేక ప్రాంతాలలో చెరువులు,కుంటలు ఎండి పోవడంతో వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున వినాయక విగ్రహాలను తరలించి కాళేశ్వరంలోని గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేసారు .

## పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి శ్రీకారం

**ప్రజాపక్షం/నెక్కొంద:** ముదిరాజ్ కులదైవం పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణ పూజ కార్యక్రమాన్ని బుధవారం ముదిరాజ్ కుల సంఘం సభ్యులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ నిర్మాణం విజయవంతంగా పూర్తై, భక్తులకు ఆధ్యాత్మికంగా ఉపయోగపడాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కుల సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## హోంగార్డ్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేసిన జిల్లా ఎస్పి

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ గోలి శ్రీనివాస్ ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ తరఫున వెల్ఫేర్ ఎక్స్‌గ్రేషియా కింద మంజూరైన రూ.20,000 చెక్కును జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ బుధవారం కుటుంబ సభ్యుల కుఅందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, హోంగార్డ్ గోలి శ్రీనివాస్ అకాల మరణం పోలీస్ శాఖకు తీరని లోటని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ వెల్ఫేర్ పథకాలు సిబ్బంది కుటుంబాలకు ఆపద సమయంలో ఆర్థిక భరోసా కల్పించడంలో కీలకంగా నిలుస్తాయని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్ఐ సంతోష్ కుమార్, హోంగార్డ్ గోలి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## దశదిన కర్మకు హాజరైన మంత్రి



**ప్రజాపక్షం/తాడ్వాయి :** ఇటీవల అనారోగ్యంతో మరణించిన మేడారం ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ ఆరెం లచ్చునాయక్ అల్లుడు గౌరబోయిన మనోహర్ దశదిన కర్మ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క హాజరై మనోహర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. వారికి ఆర్థిక సహాయం అందజేసి కుటుంబానికి అన్నివేళలా అండగా ఉంటామంటూ భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, వ్యవసాయ కమిటీ చైర్మన్ రేగా కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జన వేళ..గణనాథులకు వీడ్కోలు

### 18 గ్రామపంచాయతీల్లో భక్తిశ్రద్ధలతో నిమజ్జనం



**ప్రజాపక్షం/గోవిందరావుపేట:**గణపతి నవరాత్రి ఉత్సవాలు తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించిన అనంతరం బుధవారం మండల వ్యాప్తంగా వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం జరిగింది మండలంలోని 18 గ్రామపంచాయతీల పరిధిలో సుమారు 90కి పైగా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో ఆయా గ్రామాల నుంచి వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు చల్వాయి గ్రామంలోని గౌరరం చెరువు వద్ద నిమజ్జానం కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు మండలానికి చెందిన కొన్ని వినాయక విగ్రహాలను ఏటూరునాగారం సమీపంలోని గోదావరి ముళ్లకట్ట వద్ద కూడా కొన్ని విగ్రహాలను చల్వాయి గౌరరం చెరువు వద్ద నిమజ్జనం చేశారు నిమజ్జన ఈ కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా పోలీస్ శాఖ రెవెన్యూ పంచాయతీరాజ్ శాఖల అధికారులు ఏర్పాట్లు చేశారు తహసీల్దార్ ఎంపీడీవో పోలీస్ శాఖ అధికారులు నిమజ్జన ప్రాంతాలను పర్యవేక్షించారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు భక్తుల గణనాథులను ఊరేగింపుగా తీసుకెళ్లి భక్తి శ్రద్ధలతో నిమజ్జనం చేసి వీడ్కోలు దీంతో మండలంలో తొమ్మిది రోజుల పాటు కొనసాగిన గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి.

# గణపయ్యా..పోయి రావయ్యా

### ✻ 12 మండలాల్లో ఘనంగా గణేష్ నిమజ్జనం ✻ భక్తిశ్రద్ధల మధ్య గణనాథుడికి వీడ్కోలు..✻ భారీగా తరలివచ్చిన భక్తులు

**ప్రజాపక్షం/భూపాలపల్లి:** వినాయక చవితి ఉత్సవాలు ముగియడంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా గణేష్ నిమజ్జనోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. జిల్లాలోని 12 మండలాల్లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలను భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి శోభాయాత్రలతో నిమజ్జన ప్రదేశాలకు తరలించారు. గణపతి బప్పా మోరియా.. బై బై గణేశా అంటూ నినాదాలు చేస్తూ గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు.

### శోభాయాత్రల్లో సందడి

జిల్లా కేంద్రం తో పాటు మండల కేంద్రాలు, గ్రామాల్లో గణేష్ మండపాల వద్ద ఉదయం నుంచే సందడి నెలకొంది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రధాన వీధుల మీదుగా ఊరేగింపుగా తీసుకెళ్లారు. యువత బ్యాండ్ మేళాల మధ్య ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ శోభాయాత్రలో పాల్గొన్నారు. మహిళలు, చిన్నారులు సైతం పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి వీడ్కోలు పలికారు.

### ధర్మ వాహిని ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం

గణేశ నిమజ్జనం సందర్భంగా భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని అంబేద్కర్ సెంటర్లో ధర్మ వాహిని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణేష్ విగ్రహాలను నిమజ్జన కోసం కాలేశ్వరం తరలిస్తున్న సందర్భంగా నిర్వాహకులను సభ్యులను ప్రత్యేకంగా శాలువాతో సత్కరించారు.

### 12 మండలాల్లో

జిల్లాలోని భూపాలపల్లి, చిట్యాల, గణపురం, కాటారం, మహాదేవపూర్, మహాముత్తారం, మల్హర్, మొగుళ్లపల్లి, పలిమెల, రేగొండ, టేగొండ, వెంకటాపూర్ మండలాల పరిధిలో గణేష్ నిమజ్జన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి మండలంలోనూ స్థానికంగా ఏర్పాటు చేసిన గణేష్ మండపాల నుంచి విగ్రహాలను ఊరేగింపుగా నిమజ్జన ప్రదేశాలకు తరలించారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ నిమజ్జన శోభాయాత్రలు ఉత్సాహంగా సాగాయి. పలుచోట్ల నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలు, అన్నదానం ఏర్పాటు చేశారు.

### పోలీసుల భారీ బందోబస్తు

నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ప్రధాన నిమజ్జన ప్రదేశాలు, శోభాయాత్ర మార్గాల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. నిమజ్జన ప్రాంతాల్లో అధికారులు, పోలీసు సిబ్బంది నిరంతరం పర్యవేక్షించారు.

### పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం

నిమజ్జన సమయంలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు, ప్రజలకు సూచించారు. నిమజ్జనం అనంతరం వ్యర్థాలను తొలగించేందుకు సంబంధిత సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

### భక్తిశ్రద్ధల మధ్య ముగిసిన ఉత్సవాలు

వినాయక చవితి నుంచి నిమజ్జనం వరకు జిల్లావ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. గణనాథుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, జిల్లా సుభిక్షంగా అభివృద్ధి చెందాలని భక్తులు ఆకాంక్షించారు. భక్తుల నినాదాల మధ్య గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేయడంతో ఈ ఏడాది గణేష్ ఉత్సవాలు ఘనంగా ముగిశాయి.

## హనుమకొండలో పర్యాటక ఉత్సవాలకు సిద్ధం

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ప్రపంచ పర్యాటక దినోత్సవం సెప్టెంబర్ 27 సందర్భంగా జిల్లాలో పర్యాటక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ తెలిపారు.సెప్టెంబర్ 25 శుక్రవారం ఉదయం 6 గంటలకు హన్మకొండ కలెక్టరేట్ లో యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 26 శనివారం నాడు టూరిజం యువ క్లబ్ విద్యార్థులకి ప్రత్యేక టూర్ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఉదయం పద్మాక్షి టెంపుల్, అగ్గలయ్య గుట్ట వద్ద హెరిటేజ్ వాక్ నిర్వహణ తో పాటుగా ఇతర పర్యాటక స్థలాలు టూర్ ను నిర్వహిస్తున్నారు. ఆదివారం సెప్టెంబర్ 27 సాయంత్రం హన్మకొండ పబ్లిక్ గార్డెన్ లో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. జిల్లా విద్యాశాఖ సహకారంతో ఇప్పటికే విద్యార్థులకు యువ టూరిజం క్లబ్ ల ద్వారా వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తామని శివాజీ తెలిపారు.

## జిఎంఆర్ బృందావన్ గణపతికి ప్రథమ బహుమతి

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ వడ్డేపల్లి లోని జిఎంఆర్ బృందావన్ అపార్ట్మెంట్స్ లో ప్రతిష్ఠించిన గణపతికి గణపతి నవరాత్రి ఉత్సవ సమితి పక్షాన ప్రథమ బహుమతి దక్కింది.గణపతి నవరాత్రి ఉత్సవ సమితి మంగళవారం కాళోజి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఈ బహుమతిని జిఎంఆర్ వాసులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిఎంఆర్ అధ్యక్షులు వి. దయాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు కోటి చింతల వెంకట రావు, కోశాధికారి డి. నవీన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ, విగ్రహ దాత చింతకుంట్ల రవీందర్ రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.అత్యంత భక్తిశ్రద్ధలతో,పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని నిబంధనలకు అనుగుణంగా ఇక్కడ పూజలు నిర్వహించడం విశేషం.ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులలో భక్తిభావాన్ని నింపాయి. ఉత్సవాలు విజయవంతానికి జిఎంఆర్ బృందావన్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీతో పాటు శ్రీ విజయ గణపతి ఉత్సవ సమితి కమిటీ సభ్యులు అహరహం శ్రమించారని నిర్వాహకులు తెలిపారు.

## తల్లి ఒడిలోకి తనయుడు... ఘనంగా గణనాథుడి నిమజ్జనం

**ప్రజాపక్షం/నెక్కొంద:** నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథులు గురువారం శుక్రవారం నెక్కొంద మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఘనంగా నిమజ్జనమయ్యారు. భక్తులు ఆటపాటలు, కోలాటాలు, భజనలతో రేగింపులు నిర్వహించి గణపయ్యకు వీడ్కోలు పలికారు. గణపతి బప్పా మోరియా..వచ్చే ఏడాది మళ్లీ రావయ్యా అంటూ నినాదాలతో గ్రామాలు మార్మోగాయి. మండల కేంద్రంలోని ఎస్‌బిఐ సమీప కళ్యాణ మండపంలో తొమ్మిది రోజుల పాటు గణపతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. భక్తులకు ప్రతి రోజూ ఉదయం అల్పాహారం, రాత్రి భోజన వసతి కల్పించిన నిర్వాహకులకు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. వినాయకుడి విగ్రహాలను ఎత్తుకొని దేసూ శోభారాణి, నాగబండి నిర్మల, గంధం మంజులలు గణపతిని అందుబాటులో ఉన్న ప్రాంతంలో నిమజ్జనం చేశారు.

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన చెట్టుపెల్లి

**ప్రజాపక్షం/మంగపేట :** మంగపేట మండలం అంబేద్కర్ సంఘం జిల్లా కో కన్వీనర్ మోదుగు బాబు సతీమణి మోదుగు శ్రీలత అనారోగ్యంతో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి తుదిశ్వాస విడిచిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు పార్టీ నాయకులతో కలిసి తిమ్మంపేట వారి నివాసానికి స్వయంగా వెళ్లి శ్రీలత పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించి,ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం మోదుగు బాబును పరామర్శించి, ఈ విషాద సమయంలో మనోధైర్యంతో ఉండాలని, కుటుంబ సభ్యులకు,ముఖ్యంగా పసిపిల్లలకు అండగా నిలవాలని ధైర్యం చెప్పారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో ఆత్మ మాజీ చైర్మన్ పగిడిపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు మైప లాలయ్య గ్రామ ప్రధాన కార్యదర్శి బోడ బొరయ్య, బోడ రామచంద్రం, బోడ శివయ్యతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రవర్తన సీడ్ సౌభాగ్యపై ప్రదర్శన క్షేత్రం

**ప్రజాపక్షం/ఆత్మకూరు:** ఆత్మకూరు మండలం పెంచికల పేట గ్రామంలో బుధవారం రోజున ప్రవర్తన సీడ్స్ ప్రైవేట్ కంపెనీ ఆధ్వర్యంలో ఆ కంపెనీ వెరైటీ సౌభాగ్య బీటీ2 పత్తిపై కంపెనీ రీజినల్ మేనేజర్ పూజారి రాఘవేంద్ర టిఐఎస్ఎమ్‌సాయి రెడ్డి ఆధ్వర్యంలో ప్రదర్శన జరిగినది... ఈ సందర్భంగా ఆర్ఎమ్‌రాఘవేంద్ర మాట్లాడుతూ సౌభాగ్య బీటీ2 పత్తి విత్తనం ద్వారా అధిక దిగుబడి వస్తుందని రోగాల బారి నుండి తట్టుకుంటుందని అన్నారు... ఈ సందర్భంగా శ్రీ రామ సీడ్స్ డీలర్ కుండే కృష్ణంరాజు, ఎస్ఏ కోలగాని నరేష్, ప్రదర్శన క్షేత్ర యజమానిమహేందర్ఇతర రైతులు పాల్గొన్నారు.

# గ్రామానికి నష్టం కలిగిస్తే ఊరుకోను

### కంఠాత్మకూర్ సర్పంచ్ కొంగంటి తిరుపతి



**ప్రజాపక్షం/నడికూడ:** నడికూడ మండల పరిధిలోని కంఠాత్మకూర్ గ్రామ పరిధిలోని చాకిరేవు గుట్టపై మైనింగ్ విషయంలో తనపై వస్తున్న ఆరోపణలను సర్పంచ్ కొంగంటి తిరుపతి ఖండించారు. నడికూడ ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థిక డిమాండ్ చేశారన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని ,తాను ఒక్క రూపాయి తీసుకున్నట్లు నిరూపిస్తే సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు.ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తే పరువునష్టం దావా వేయాల్సి వస్తుందని హెచ్చరించారు. మైనింగ్‌కు తాను వ్యతిరేకం కాదని,గుట్టను తవ్వడం వల్ల గ్రామానికి,రైతులకు జరిగే నష్టానికే వ్యతిరేకమని తెలిపారు.గుట్టకు సమీపంలోని మాటు రిజర్వాయర్‌పై ఆధారపడిన సుమారు 1,600 ఎకరాల ఆయకట్టు, కాకతీయుల కాలం నాటి శివాలయం, మడేలయ్య ఆలయం,గుట్టకు సమీపంలోని హై లెవెల్ వంతెన, తాటి,ఈత చెట్లు,పంట పొలాలు, స్మశానవాటికకు మైనింగ్ వల్ల నష్టం వాటిల్లే అవకాశం ఉందని పేర్కొన్నారు. రిజర్వాయర్ పరిధిలోని సహజ వాగులు,జలపాతాలు,పర్యాటక ప్రాంతం కూడా దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు.రాజకీయాలు,కులాలకు అతీతంగా గ్రామస్తులు చాకిరేవుగుట్ట పరిరక్షణ సమితి(జేఏసీ)గా ఏర్పడి ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడుతున్నారని,వారి తరపున సర్పంచ్‌గా తాను గొంతు వినిపిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో శనిగరం సర్పంచ్ కొత్తపల్లి రాజు,మాదన్నపేట సర్పంచ్ కత్తి రమేష్,ధర్మారం సర్పంచ్ బాషిక ఎల్లస్వామి, రామకృష్ణాపురం మాజీ సర్పంచ్ పెండ్లి రాజు,కంఠాత్మకూర్ ఉపసర్పంచ్ కుమారస్వామి, మాదన్నపేట రైతు బుర్ర కర్ణాకర్, కంఠాత్మకూర్ మాజీ సర్పంచ్ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎంజిఎంలో రోగులను ఎలుకలు కొరికినప్పుడు ఏం చేశారు ?

### మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్‌ను ప్రశ్నించిన తోట పవన్



**ప్రజాపక్షం/హనుమకొండ :**మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌కు నటసార్వభౌమ అవార్డు ఇవ్వాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తోట పవన్ ఎద్దేవా చేశారు. ప్రజల్లో ఆదరణ కరువవడంతోనే దాస్యం వినయ్ భాస్కర్ కొత్త నాటకాలకు తెరలేపుతున్నారని విమర్శించా రు.ఎంజిఎం ఆసుపత్రి వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందిపై దాడి చేసింది వినయ్ భాస్కరే అని తోట పవన్ ఆరోపించారు.పోలీసులపై దాడి ఘటనకు సంబంధించి ప్రజలకు వాస్తవాలు తెలియాల్సిన అవసరం ఉందని అన్నా రు. దాస్యం వినయ్ భాస్కర్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఎంజిఎం ఆసుపత్రిలో రోగులను ఎలుకలు కొరికినప్పుడు మీరు ఏం పీకారు? అని తోట పవన్ తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. అప్పట్లో ఆసుపత్రిలో రోగుల భద్రత, వైద్య సదుపాయాలు, పారిశుధ్య పరిస్థితులపై మీరు ఎలాంటి చర్యలు తీసుకున్నారని నిలదీశారు.ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, చిల్లర రాజకీయాలతో ప్రజలను మభ్యపెట్టలేరని అన్నారు.

# మామునూరు ఎయిర్‌పోర్టుకు 'రాణి రుద్రమదేవి' పేరు పెట్టాలి



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టుకు కాకతీయ సామ్రాజ్యాన్ని సమర్థంగా పరిపాలించిన వీరనారి రాణి రుద్రమదేవి పేరు పెట్టాలని తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర కోరారుఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా తన అభిప్రాయాన్ని వెల్లడించారు. కాకతీయుల చరిత్ర తెలంగాణ సాంస్కృతిక వైభవం మహిళా నాయకత్వానికి ప్రతీకగా నిలిచిన రాణి రుద్రమదేవి పేరు మామునూరు విమానాశ్రయానికి పెట్టడం ద్వారా తెలంగాణ చారిత్రక వారసత్వాన్ని గౌరవించినట్లవుతుందని ఆయన పేర్కొన్నారు.మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధి వరంగల్ ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష అని, విమానాశ్రయానికి రాణి రుద్రమదేవి పేరు పెట్టడం ద్వారా కాకతీయుల ఘన చరిత్రను దేశవ్యాప్తంగా పరిచయం చేసే అవకాశం ఉంటుందని రాజేష్ ఖన్నా గంగపుత్ర అన్నారు. ప్రభుత్వం ప్రజాప్రతినిధులు చరిత్రాభిమానులు ఈ ప్రతిపాదనను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తెలంగాణ చరిత్ర సంస్కృతి వారసత్వాన్ని కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# ఉచిత విద్య, వైద్యం అందించే వారికే ఓటు

### బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దుగ్గంపూడి రంజిత్ రెడ్డి



**ప్రజాపక్షం/ హనుమకొండ టౌన్:** డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం పౌరుల హక్కు అయినా ఉచిత విద్య, ఉచిత వైద్యం పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికి సమానంగా నాణ్యమైన సేవలు అందించే వారినే ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకోవాలని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు దుగ్గంపూడి రంజిత్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రంజిత్ రెడ్డి మాట్లాడుతూ గత కొంతకాలంగా ప్రజలను చైతన్యం చేసేందుకు ఉచిత విద్య, వైద్యం ప్రభుత్వాలు అందించాలనే నినాదంతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఏ ఎన్నిక జరిగిన ప్రజలు తమ ప్రాథమిక హక్కు అయినా ఉచిత విద్య వైద్యం అందించే వారికి ఓటు వేస్తామని కరాకండిగా చెప్పాలని సూచించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డినా..ఆయన అల్లుడా అనే అనుమానాలు ప్రజలకు తలెత్తుతున్నాయని అన్నారు. ఏకంగా ఆయన అల్లుడు అధికారులనే ఆదేశాలిస్తూ దానిని సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. తన మాట వినని యువకులపై కేసులు పెట్టిస్తూ ఆంధ్ర నుండి వచ్చిన వ్యక్తి తెలంగాణలో బెదిరింపులు చేస్తున్నారని వాపోయారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తనపై చేసిన విమర్శలు నిజమని నిరూపిస్తే దేనికైనా సిద్ధమే అన్నారు. తాను కుటుంబంతో ప్రమాణం చేస్తానని ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి తమ కుటుంబం పై ప్రమాణం చేయాలని అన్నారు. నగరంలో భూకబ్జాలు చేసేందుకు ఒక టీంను పెట్టుకొని వారి ఆధ్వర్యంలో అడుగడుగున భూకబ్జాలు చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలు తెలుసుకుంటూ నిత్యం పేద ప్రజలు వైద్యం పొందుతున్న ఎంజీఎం హాస్పిటల్ లో పర్యటించి అక్కడి సమస్యలు పరిష్కరించాల్సింది పోయి సమస్యలను తెలుసుకునేందుకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ పై దాడి హేయమైన చర్య అన్నారు. ఇప్పటికైనా రాజేందర్ రెడ్డి పద్ధతి మార్చుకోవాలని లేకపోతే ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు అని హెచ్చరించారు.

# కస్తూరిబా బాలికల పాఠశాలలో హెచ్‌పివి వ్యాక్సినేషన్ శిబిరం

**ప్రజాపక్షం/వెంకటాపూర్ :** మండల పరిధిలోని జవహర్‌నగర్ గ్రామంలో గల కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో బుధవారం హెచ్‌పివి (హ్యూమన్ పాపిల్లోమా వైరస్) వ్యాక్సినేషన్ కార్యక్రమం లక్ష్మీదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి, మాత సంరక్షణ జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ చీర్ల శ్రీకాంత్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగ అనేష్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలియజేశారు.ఈ సందర్భంగా 14 నుంచి 15 సంవత్సరాల లోపు వయసు గల బాలికలకు గర్భాశయ ము ఖద్వార క్యాన్సర్‌ను నివారించే హెచ్ పి వి వ్యాక్సిన్‌ను అధికారులు అందించారు. మొత్తం 80 మంది బాలికలు ఈ వ్యాక్సినేషన్‌లో పాల్గొని వ్యాక్సిన్ వేయించుకున్నారని తెలియజేస్తూ ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ చీర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ,యుక్త వయసులంటే 14 నుంచి 15 సంవత్సరాల మధ్య వయసులో ఈ వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా భవిష్యత్తులో ఈ ప్రాణాంతక వ్యాధి బారిన పడకుండా రక్షణ పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో భాగంగా డాక్టర్ నాగ గణష్ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల కలిగే లాభాలను వివరిస్తూ, 90 శాతానికి పైగా క్యాన్సర్ ముప్పును నివారించవచ్చని, ఇది సురక్షితమైనదే కాక దీర్ఘకాలిక ప్రయోజనాలను చేకూరుస్తుందని పేర్కొన్నారు. ములుగు జిల్లా వ్యాక్సి న్ మేనేజర్ దివ్య, జవహర్ నగర్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యాధికారి డాక్టర్ జి. ఆర్.వి సంఘమిత్ర, హెల్త్ సూపర్‌వైజర్ పు ష్పకుమారి, పాఠశాల ఉపాధ్యాయులు రజిత, సుజాత ఆరోగ్యకార్యకర్తలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆయూష్ వైద్య శిబిరం ప్రారంభం

**ప్రజాపక్షం/జనగామ:** 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా బుధవారం జనగామ పట్టణంలోని యూపిహెచ్‌సి లో ఆయుష్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వాణి శ్రీ ప్రారంభించి ఆయుష్ వైద్య సేవల గురించి వివరించారు. ఆయుష్ వైద్యం, ఆరోగ్య పరిరక్షణ, ఆరోగ్యకర జీవనశైలిపై వివరించారు. ఆయుష్ వైద్య సేవల్ని వినియోగించుకోవాలన్నారు. కాగా 520 మంది రోగులు పాల్గొని వైద్య సేవలు పొందారు.జిల్లా ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ మమత, డాక్టర్ సరిత, డాక్టర్ ప్రియదర్శిని, డాక్టర్ జునైద్, డిపిఎం కుమార్, డా క్టర్ అనురాధ, ఇతర ఆయుష్ వైద్యులు పా ల్గొన్నారు.

# ఘనంగా గణేష్ నిమజ్జన వేడుకలు

**ప్రజాపక్షం / వేలేరు :** వేలేరు మండలంలోని గ్రామాలలో బుధవారం గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా గణనాధుని నిమజ్జన వేడుకలు అర్చకులు చౌదరి సంతోష్,చౌదరి వీర సాయి ఆధ్వర్యంలో మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు,నైవేద్యాలు సమర్పించి హారతులు ఇచ్చి గణేష్ ని విగ్రహాన్ని భక్తులు ఊరేగింపుగా పోలీసుల పర్యవేక్షణలో తీసుకెళ్లి నిమజ్జనం చేసి పోయిరా గణపయ్య..పోయిరా అంటూ పీచరలో నీల్లు లేని జంగం కుంటలో వదిలి వీడుకోలు పలికారు.అనంతరం మండలంలోని గ్రామాలలోని భక్తులు వర్షాలు కురిసి చెరువులు నిండాలని భక్తులు మొక్కులు చెల్లించుకోవడం జరిగింది.

# గంగమ్మ ఒడిలోకి గణేశుడు

**ప్రజాపక్షం/నడికూడ :** నడికూడ మండలంలోని పలు గ్రామాలలో ఆధ్వర్యంలో నిర్వహించిన తొమ్మిది రోజుల గణపయ్య పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి.అనంతరం గంగమ్మ ఒడిలోకి గణపయ్య నిమజ్జన కార్యక్రమం విజయవంతంగా పూర్తయింది.ఈ సందర్భంగా పలువురు యూత్ సభ్యులు మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో స్థానిక ప్రజలు, యువత,మహిళలు, చిన్నారులు,కుటుంబ సభ్యులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.వివిధ పూజా కార్యక్రమాలు,భక్తి కార్యక్రమాలు, అన్నప్రసాదాలు,నిర్వహిస్తూ భక్తిశ్రద్ధలతో స్వామివారిని కొలిచారు.ఈ కార్యక్రమాలు స్థానికంగా ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పడంతో పాటు ప్రజల్లో ఐక్యత,సేవాభావం సామాజిక స్ఫూర్తిని పెంపొందించాయని తెలిపారు.

# గూడూరు మండలంలో ఘనంగా గణనాథుల నిమజ్జనం

**ప్రజాపక్షం/గూడూరు;**మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల వ్యాప్తంగా వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకోవడంతో గణేష్ నిమజ్జన వేడుకలు అంగరంగ వైభవంగా అత్యంత భక్తిశ్రద్ధల నడుమ కొనసాగాయి మండలంలోని 41 గ్రామపంచాయతీల పరిధిలో కొలువుదీరిన వినాయక ప్రతిమల నిమజ్జనోత్సవం పండుగ వాతావరణంలో విజయవంతంగా పూర్తయింది. గూడూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద ప్రతిష్ఠించిన విగ్రహానికి శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిమజ్జనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.అలాగే స్థానిక అరవింద హైస్కూల్‌లో తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పేజలతో ఘనంగా నిర్వహించిన నవరాత్రోత్సవాల అనంతరం బొజ్జ గణపయ్యను ఘనంగా సాగనంపారు.మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో యువకులు భక్తులు డప్పుచప్పుళ్ల తీన్మార్ నృత్యాలు భజన కీర్తనలతో హోరెత్తించారు. ముక్కుకూడళ్ల గుండా సాగిన శోభాయాత్రలో మహిళలు చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొని హారతులు పట్టారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గూడూరు సీఐ వినయ్ కుమార్ ఎస్ఐ రమేష్ బాబు వారి తో పాటు పోలీస్ యంత్రాంగం పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టింది. ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు సమన్వయంతో వేడుకలను విజయవంతం చేశారు.

# 27న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం 9వ ఆవిర్భావ దినోత్సవం

**ప్రజాపక్షం/ఎల్కతుర్తి :**తెలంగాణ ఉద్యమకారుల ఫోరం 9వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సెప్టెంబర్ 27న యాదగిరిగుట్టలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో నిర్వహించనున్నట్లు ఉద్యమకారుల ఫోరం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం 9వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి నిర్మల మనోహర్ హాజరయ్యారు. పోస్టర్ ఆవిష్కరణ అనంతరం ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 27న యాదగిరిగుట్టలో నిర్వహించే ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. మర్రి అమరేందర్, పుట్ట ప్రతాప్, జూపాక శ్రీనివాస్, మేకల రాజయ్య, వంగ రవి,రాజకుమారి, కమలాబాయి, రాధమ్మ,భాగ్యమ్మ, విజయమ్మ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌పికి శుభాకాంక్షలు



ప్రజాపక్షం / మెదక్ : మెదక్ జిల్లా ఎస్‌పి డి.వి శ్రీనివాస్ రావు పుట్టిన రోజు సంద ర్భంగా మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతిరాజు ఎస్పీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.బుధవారం ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు ను మర్యాద పూర్వ కంగా కలిసి శాలువాతో సత్కరించి, మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో ఎస్‌పి అందిస్తున్న సేవలు అభినందనీయమని ఈ సందర్భంగా ఆమె కొనియాడారు.ఈ కార్యక్రమంలో మున్సి పల్ కౌన్సిలర్ మన్సూర్ అహ్మద్ నాయకులు భూపతి రాజు, ప్రవీణ్ కుమార్, బాల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

**దళిత సంఘాల నేతల శుభాకాంక్షలు**

**నిజాంపేట్ :** మెదక్ జిల్లా కేంద్రంలో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీనివాసరావు ను మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన దళిత సంఘాల నేత లు. ఈ సందర్భంగా ఎస్‌పికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి కేక్ కట్ చేయించారు. ఆయన ఆరోగ్యంగా ఉండి మ రిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గురుగుల శ్రీనివాస్, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీని యర్ నాయకులు బాలసాయి హరిప్రసాద్, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి మాసన్నగారి నాగరాజ్, నిజాంపేట్ మండల అధ్యక్షులు జనగామ స్వామి, మెదక్ జిల్లా అధ్యక్షులు అర్క అశోక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కల్లు యాదన్న, కాం గ్రెస్ నాయకులు సంగి యాదయ్య, నీలకంఠి సుదర్శనం తదితరులు ఉన్నారు.

## కూరగాయల మార్కెట్ ప్రారంభం



ప్రజాపక్షం / నిజాంపేట్: బచ్చురాజుపల్లి గ్రామంలో కూరగాయలు తెచ్చుకోవడానికి వేరే గ్రామాలకు వెళ్లడం కష్టంగా మారిన తరు ణంలో అందరి కష్టాన్ని దృష్టిలో ఉంచుకొని బుధవారం కూరగాయల మార్కెట్ ని సర్పంచ్ శైలజ శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రజల ఇ బ్బందిని గుర్తు ఉంచుకొని ప్రతి బుధవారం ఉ దయం కూరగాయల మార్కెట్ నిర్వహిస్తామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గం, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గణనాథుడి ఊరేగింపు

ప్రజాపక్షం/పాపన్నపేట: మండలంలోని యూసుఫ్‌పేట గ్రామంలో గణేశ్ నిమజ్జనో త్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాధార ణంగా ట్రాక్టర్లు, ఆటోలు, ఇతర వాహనాలపై గణనాథుడిని తరలిస్తుండగా గ్రామంలో మా త్రం కారుపై గణనాథుడిని అలంకరించి నిమ జ్జనానికి తరలించడం ప్రత్యేకంగా నిలిచింది. పూలమాలలు, పచ్చని ఆకులతో అందంగా అ లంకరించిన గణనాథుడిని కారుపై ప్రతిష్ఠించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. గణనాథుడి ఊరేగింపు సాగుతుండగా యువకులు రం గులు చల్లుకుంటూ, డప్పుల మోతకు ఉత్సా హంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

## జీవవైవిధ్య పరిరక్షణలో కమిటీల పాత్ర కీలకం



ప్రజాపక్షం/అల్లాదుర్గం: మండల పరిధిలో గల అప్పాజీ పల్లి గ్రామం లో బుధవారం గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో జీవవైవిధ్య కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్‌గా గందిలి రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ, జీవవైవిధ్యాన్ని పరిరక్షించడంలో జీవవైవిధ్య నిర్వహణ కమిటీలపాత్ర ఎంతో కీలకమని పే ర్కొన్నారు. గ్రామాలు, స్థానిక సంస్థల పరిధిలోని వృక్ష జాలం, జంతుజాలం, ఔషధ మొక్కలు, స్థానిక వనరులను గుర్తించి వాటి సంరక్షణకు చర్యలు చేపట్టడం కమిటీల ప్రధాన బాధ్యత అన్నారు. స్థానికంగా లభించే జీవవైవిధ్య వనరులపై సమాచారాన్ని సేకరించి పీపుల్స్ బయోడైవర్సిటీ రిజిస్టర్ (పిబిఆర్) లో నమోదు చేయడం ద్వారా భవిష్యత్ తరాలకు విలువైన ప్రకృతి సంపదను అందించేందుకు అవ కాశం ఉంటుందని అరుదైన మొక్కలు, పక్షులు, జంతు వులు, సంప్రదాయ పంటలు, ఔషధ మొక్కలు వంటి వాటిని సంరక్షించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించా ల్సిన బాధ్యత కమిటీకి ఉంటుందన్నారు. కమిటీ సభ్యు లుగా నవీన్ కుమార్, లంబాడి తులసి, బర్సం లక్ష్మి, శ్రీశైలం గొల్ల కేసయ్య సాయిలు ఉన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మహోత్సవాలు



ప్రజాపక్షం/వెల్దుర్తి: వెల్దుర్తి మండల పరిధి చేరిల గ్రామ అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడి టీచర్లు దేవలత లక్ష్మి ల ఆధ్వర్యంలో సర్పంచి లావణ్య అధ్యక్షతన బుధవారం పో షణ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా గర్భిణీ బాలింతలకు పౌష్టికాహారం పై అవగాహన కల్పించారు. పోషణ మహోత్సవాల సందర్భంగా వివిధ రకాల న్యూట్రిషన్ చిరుధాన్యాలను ప్రదర్శించారు పౌష్టిక మైన ఆకుకూరలు కాయగూరలు చిరుధాన్యాలను రోజూ తీసుకునే ఆహారంలో క్రమం తప్పకుండా ఉండాలని సూచించారు. ప్రతి గర్భిణీ స్త్రీ గర్భం దాల్చిన మొదలుకొని ప్రసవించే వరకు పోస్ట్ ఆహారాన్ని తీసుకోవాలని సూచిం చారు. సర్పంచ్ లావణ్య మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రంలో అందించే అదనపు ఆహారం పాలు గుడ్లు ఆకు కూరగాయలతో కూడిన ఆహారాన్ని అంగన్వాడి కేంద్రం లోని భుజించాలని సూచించారు. ఏఎన్ఎం అనిత మాట్లా డుతూ, సబ్ సెంటర్‌లో అందించే ఆరోగ్య పరీక్షలు నెల నెల ఇంజక్షన్స్ ఐరన్ మాత్రలు క్రమం తప్పకుండా వేసుకో వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలు బాలిం తలు ఆశ వర్కర్ మంజుల చిన్నారులు పాల్గొన్నారు.

## జాతీయ ఫార్మాకోవిజిలెన్స్ వారోత్సవాలు



ప్రజాపక్షం/నర్సాపూర్: సమీపంలోని విష్ణు ఫార్మసీ కళా శాలలో 6వ జాతీయ ఫార్మాకోవిజిలెన్స్ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ వారోత్సవాలు ఈనెల 17 నుంచి 23 వరకు ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియే షన్ సహకారంతో ఈ వారోత్సవాలు నిర్వహించారు. "ఫా ర్మాకోవిజిలెన్స్ ద్వారా ఔషధాల హేతుబద్ధ వినియోగాన్ని ప్రోత్సహిస్తూ అనే ఇతివృత్తంతో నినాద రచన, ప్రిస్క్రిప్షన్ డీకోడింగ్, సర్వే, అవగాహన కార్యక్రమాల తో పాటు విద్యార్థులకు రంగోలి పోటీలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా చండీగఢ్ పీజీఐఎంఈఆర్ ప్రొఫెసర్ డా. బికాష్ మేధి మాట్లాడుతూ ఔషధాల సురక్షిత వినియోగం, దుష్ప్ర భావాల గుర్తింపు, నివేదన ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమం లో వై.ఫర్ ప్రిన్సిపాల్ డా॥ ఏ.రమేష్ కన్వీ నర్ గా, ఫార్మకాలజీ విభాగాధిపతి డా॥ పి రాజశేఖర్ సహ కన్వీనర్ గా పాల్గొని ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వై ఫర్ కళాశాల అధ్యాపకులు విద్యా ర్థులు పాల్గొన్నారు.

## ఆర్.వెంకటాపూర్‌లో సిసి రోడ్డు నిర్మాణం



ప్రజాపక్షం/రామాయంపేట: మండల పరిధిలోని ఆర్.వెంకటాపూర్ గ్రామంలోని 8వ వార్డులో బుధవారం సిసి రోడ్డు నిర్మాణం చేపట్టారు. 5లక్షల వ్యయంతో పిట్టల వాడలో సిసి రోడ్డు పనులను సర్పంచ్ వెంకుగారి ఉమా సంజీవరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లా డుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని దశల వారిగా అమలు చేస్తామన్నారు. గ్రామాభివృద్ధి ద్వారా ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. గ్రామంలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుంచుతానని ఇందుకు గ్రామ ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచు అనురాధ నరేష్, వార్డు సభ్యులు రేవతి, పుర్ర స్వామి, నాగ రాణి, రాచపల్లి ఎల్లయ్య, అక్షిత సంతోష్‌కుమార్, పంచా యతీ కార్యదర్శి యాదగిరి, కారోబార్ రత్నం, రాజు, అంజమ్మ, రమేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## రమేష్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

ప్రజాపక్షం/రామాయంపేట: తెలంగాణ ఉద్యమకారుడు రామాయంపేట మాజీ జెడ్‌పిటిసి, మెదక్ మాజీ ఆత్మక మిటి చైర్మన్ చంద్రపు రమేష్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని వర్ధంతి సభకు వచ్చిన వక్తలు పిలుపునిచ్చారు. గురువారం రమేష్‌రెడ్డి 6వ వర్ధంతి సందర్భంగా పర్వతాపూర్ మాజీ సర్పంచ్ బోయిని దయాలక్ష్మీ స్వామి తన సొంత నిధు లతో ప్రయాణికుల సౌకర్యార్థం నాలుగు సిమెంట్ బెంచీ లను లక్ష్మాపూర్ బస్టాండ్ వద్ద అందుబాటులో ఉంచారు. అనంతరం వనమహోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేసి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ బాల్‌రాజ్ తో పాటు రమేష్‌రెడ్డి సతీమణి మంజుల వారి కుటుంబస భ్యులు హాజరై నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో రమే ష్‌రెడ్డి అందించిన సేవలను స్థానికులు గుర్తు చేసుకున్నారు. ప్రజలతో మమేకమై సేవాగుణంతో ప్రతి ఒక్కరిని అక్కున చేర్చుకున్న ఆయన లేని లోటు పూడ్చలేనిదన్నారు. ఈ కా ర్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు సుభాష్, సురేష్‌నాయక్‌తో పాటు బిఆర్ఎస్ నాయకులు ఉమా మహేశ్వర్, నాయ కులు విజయబాస్కర్‌రెడ్డి, కాముని శ్రీనివాస్, డప్పు కిషన్, కట్ట లక్ష్మణ్, దప్పు స్వామి, విజయ్, ఇస్మాయిల్, తుపా కుల మహేష్, చిన్న నాయక్, బాబునాయక్‌తో పాటు తది తరులు పాల్గొన్నారు.

## చెట్ల పొదల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



ప్రజాపక్షం / నిజాంపేట్ : మెదక్ జిల్లా. నిజాంపేట్ మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో రైతు వేదిక, పెద్దబావి వద్ద ఉన్న ట్రాన్స్ఫార్మర్ల ను చెట్లు, తీగలు అల్లుకుని కమ్మేశాయి. దీంతో పెను ప్రమాదం పొంచి ఉంది.నిత్యం అక్కడి నుంచి పశు వులు, గొర్రెల కాపరులు మేతకు వెళ్తుంటారు. తీగలతో కమ్మేసిన ట్రాన్స్ఫార్మర్‌ను గమనించకపోతే ప్రమాదం తప్పదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే లోవోల్టేజ్‌తో ఇబ్బంది పడు తున్న రైతులకు, తీగల కారణంగా ట్రాన్స్ఫార్మర్ కాలిపోతే పంటలు ఎండిపోయే పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి, ట్రాన్స్ఫార్మర్లకు అల్లుకున్న చెట్లు, తీగలను తొలగించి ప్రమాదాన్ని నివారించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

## విద్యుత్ షాక్‌తో వృద్ధుడికి గాయాలు

ప్రజాపక్షం/శివ్వంపేట : శివ్వంపేట మండలం గుండ్లపల్లి గ్రామంలో ఇళ్ల మధ్య నుంచి వెళ్లిన 11కెవి విద్యుత్ లైన్ తీగలతో షాక్‌కు గురై ఓ వృద్ధుడికి తీవ్ర గాయాలైన ఘటన చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బోడింగ్ కుమార్ ఇంటికి చుట్టపుచూపుగా వచ్చిన అతని మామ ఎల్లయ్య బుధవారం ఉదయం ఇంటి భవనంపైకి ఎక్కగా విద్యుత్‌వైర్లకు తగిలి షాక్ కొట్టి భవనంపై నుంచి కింద పడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. వెంటనే కుటుంబీకులు తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి మేడ్చల్‌కు తరలించారు. ఇళ్ల మధ్య ఉన్న 11కేవీ విద్యుత్ లైన్‌ను తొల గించాలని ఎన్నోమార్లు అధికారులకు విన్నవించినప్పటికి పట్టించుకో వడం లేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవా లని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

## జీడిపల్లిలో చెత్తబుట్టల పంపిణీ

ప్రజాపక్షం/మనోహరాబాద్: పరిసరాల పరిశుభ్రతకు పెద్దపీట వేస్తూ మనోహరాబాద్ మండలంలోని జీడిపల్లి గ్రామంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటికి నాలుగు రకాల చెత్తబుట్టలను సర్పంచ్ కృష్ణ అందజేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ, సేకరించిన చెత్తను నాలుగు వేర్వేరు వర్గాలుగా విభజించి,వాటికి కేటాయించిన చెత్తబుట్టలోనే వేయాలని గ్రామస్తులకు సూచించారు. ఊరిని పరిశుభ్రంగా,ఆరోగ్యకరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ భాగస్వాములుకావాలని,పంచాయతీ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు. ఈ పంపిణీ కార్యక్ర మంలో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, ఉప సర్పంచ్ రాజు, వార్డు సభ్యులు బైరి రాజు, శ్రీనివాస్, హరిబాబులతో పాటు పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## పేద ప్రజల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

### స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేసిన చైర్మన్



ప్రజాపక్షం/అల్లాదుర్గం: తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో భాగంగా మంజూరు తాసిల్దార్ కార్యాలయం లో ప్రభుత్వం మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులు వట్టిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మి శేషారెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ, గతంలో రేషన్ కార్డులు లేక అనేక మంది అర్హులైన పేద ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తున్నదని తెలిపారు. నిరుపేదలకు ఆహార భద్రత కల్పించడంతో పాటు ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందేందుకు ఈ కార్డులు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పేద ప్రజల సమగ్ర అభివృద్ధి సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మల్లయ్య ,సర్పంచ్లు శశి రెడ్డి, కవిత విట్టల్, శ్రీనివాసరెడ్డి, హరికృష్ణ, గోపాల్ రెడ్డి, శంకర్ నాయక్, మన్య నాయక్, వీరన్న రమ్య భూమి రెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్య దర్శి బసన్నగారి బాలకిషన్, కొంకాశ్రీశైలం, జైపాల్, విట్టలరెడ్డి, బాల్ రాజు, బేతయ్యా, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆయుష్ వైద్య విధానాలు ఆరోగ్యపరిరక్షణలో ముఖ్య పాత్ర

### జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి ధన్‌రాజ్




**ప్రజాపక్షం/ సిద్దిపేట :** ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ఆధ్యాత్మికతను పెంపొందించుకోవడం ద్వారా వ్యక్తిగత శ్రేయస్సుతో పాటు సమాజం, ప్రపంచ శ్రేయస్సుకు దోహదపడాలని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి ధన్‌రాజ్ అన్నారు. జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో ఉచిత మెగా ఆయుష్ వైద్య శిబిరం బుధవారం సిద్దిపేట పట్టణంలోని స్వచ్ఛ బడి ఆవరణలో నిర్వహించిన ఉచిత మెగా ఆయుష్ వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ధనరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ధనరాజ్ ఆయుష్ వైద్య విధానాల ప్రాముఖ్యతను వివరించారు. ఆయుష్ వైద్య విధానాలు ఆరోగ్య పరిరక్షణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయని, శిబిరానికి హాజరైన ప్రజలు మరియు రోగులు ఆయుష్ వైద్య విధానాలు, మందులు మరియు చికిత్సా పద్ధతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మెరుగైన ఆరోగ్య ఫలితాల కోసం అవసరమైన సందర్భాల్లో ఆయుష్ వైద్య పద్ధతులను ఉపయోగించుకోవాలని తెలిపారు.ప్రజలకు నాణ్యమైన ఆయుష్ వైద్య సేవలను అందించడంతో పాటు ఆయుష్ వైద్య విధానాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఇందిరా ఝాన్సీ మాట్లాడుతూ, ఆయుష్ వైద్య విధానాల్లో భాగంగా కంటి సంబంధిత చికిత్సను స్వయంగా పొందిన తన అనుభవంలో మంచి ఫలితాలు పొందినట్లు తెలిపారు. ఆయుష్ వైద్య విధానాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డా. కె. అనిల్ కుమార్, సమీకృత ఆయుష్ ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్: డా. ఉమా దేవి, జిల్లా ప్రోగ్రామ్ అధికారి: డా. భానుతేజ, ఆయుర్వేద వైద్యులు డా. కేదారి, డా. సంపత్ కుమార్, యునాని వైద్యులు: డా. అజీమ్ అహ్మద్. హోమియోపతి వైద్యులు డా. గౌతమి ప్రియ ఫార్మసిస్టులు: శివ ప్రసాద్, జ్యోతి, ఐజాజుద్దీన్, సంతోషి రాణి ఎస్.ఎన్.ఓలు, వెంకటేష్, రమేష్, స్వామి, యోగా ఇన్‌స్ట్రక్టర్లు మనోహర్, రేవతి, శ్రీనివాస్, కవితలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు వినాయకుడి ప్రసాదం



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** సంగారెడ్డి మెడికల్ కాలేజీ విద్యార్థులు ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వినాయకుడి పూజ అనంతరం లడ్డూ ప్రసాదాన్ని ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కు అందజేశారు. వినాయక చవితి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్న విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. విద్యార్థులకు వినాయకుడి ఆశీస్సులు ఎల్లప్పుడు ఉండాలని ,చదువులో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## యువతకు ఆధునిక క్రీడా సౌకర్యాలు

**ప్రజాపక్షం/జోగిపేట :** అందోల్ నియోజకవర్గానికి మరో భారీ అభివృద్ధి కానుక లభించింది. అందోల్, జోగిపేటలోని ఎన్‌టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం రూ.10 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు సెప్టెంబర్ 21 న జిఒ ఆర్‌టి నెం. 282 ద్వారా పరిపాలనా అనుమతులు జారీ అయ్యాయి. ఈ నిధులతో క్రీడా మౌలిక సదుపాయాలను మరింత ఆధునికరించేందుకు చర్యలు చేపట్టమన్నారు.

## 26న చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 26వ తేదీన ఉదయం 10.30గంటలకు సంగారెడ్డి కలెక్టరేట్ సమీపంలో చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలతో పోరాడి పేదలు,అణగారిన వర్గాల హక్కుల కోసం ఉద్యమించిన గొప్ప వీరనారి అని కలెక్టర్ తెలిపారు. జయంత వేడుకల్లో ప్రజాప్రతినిధులు ,అధికారులు ,వివిధ సంఘాల ప్రతినిధులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

## శాతవాహన ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించిన మంత్రి

**ప్రజాపక్షం / హుస్నాబాద్:** హుస్నాబాద్ శాతవాహన యునివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలను తెలంగాణ బి సి రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులతో ముఖా ముఖీ మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చెప్పిన సమస్యలను వెంటవచ్చిన అధికారులనోటు చేసుకుని వెంటనే వాటి పరిష్కారం చేపట్టాలని ఆదేశించారు. హాస్టల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పరిశుభ్రమైన ఆహారం అందించాలని ప్రతి రోజు ఒక అధికారి విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని ఆహర నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అలాగే విద్యార్థుల సమస్యలను అడిగితెలుసుకున్నారు. విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి దురలవాట్లుకు దూరంగా ఉండాలని ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకొని ఉన్నత చదువులకు వెళ్లి మంచి ఉద్యోగాలు పొంది తల్లిదండ్రుల మంచి పేరు తెవాలని సూచించారు. కళాశాలలో మంచి ప్రతిభ కనబరిన వారికి ల్యాబ్‌ట్యాబ్‌లు అందిస్తామని మంత్రి తెలిపారు. అనంతరం పట్టణంలోని 16 వార్డులో 20లక్షలతో హెల్త్ సబ్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ దండి లక్ష్మి కొమురయ్య, వైస్ చైర్‌మెస్ చిత్తారి పద్మరవిందర్, సహకారసంఘం చైర్మెన్ బొల్లిశెట్టి శివయ్య, మాజీ గ్రంధాల చైర్మెన్ కేడం లింగమూ ర్తి, శాతవాహన యునివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ,రిజిష్టర్, తహశీల్దార్ లక్ష్మారెడ్డి , అధ్యాపకులు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## విద్యార్థుల చేతిలో ‘ సోషల్ వాలా’

### డిఇఒ రమేష్




**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** సిద్దిపేట జిల్లా సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో సాంఘిక శాస్త్ర విద్యార్థుల కోసం రూపొందించిన “సోషల్ వాలా” వెబ్‌సైట్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి సిహెచ్ రమేష్ ఆవిష్కరించారు. జిల్లాలోని ధూల్మిట్ట జిల్లాపరిషత్ పాఠశాల సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయుడు ఎస్. రంజిత్ కుమార్ ఈ వెబ్‌సైట్‌ను రూపొందించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి సిహెచ్ రమేష్ మాట్లాడుతూ, సిద్దిపేట జిల్లాలోని అన్ని సబ్జెక్ట్ ఫోరంలలో సాఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం వినూత్న, సృజనాత్మక కార్యక్రమాలతో ముందుకు సాగుతుందని అభినందించారు. ఈ సందర్బంగా సిద్దిపేట జిల్లా సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం అధ్యక్షుడు మామిడి పూర్ణచంద్రరావును, అలాగే “సోషల్ వాలా” వెబ్‌సైట్‌ను రూపొందించిన ధూల్మిట్ట జిల్లాపరిషత్ పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఎస్. రంజిత్ కుమార్‌ను డిఇఒ రమేష్ ప్రత్యేకంగా అభినందించారు. సాంఘిక శాస్త్ర విద్యార్థులకు డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్ “సోషల్ వాలా”ను రూపొందించినట్లు రూపకర్త సుద్దాల రంజిత్ కుమార్ తెలిపారు. ఈ వెబ్‌సైట్ లో ఆన్‌లైన్ పరీక్షలు, మ్యాపింగ్ పాయింట్స్, వీడియో పాఠాలు, ఆన్‌లైన్ స్టడీ మెటీరియల్‌లు అందుబాటులో ఉంటాయని రంజిత్ తెలిపారు. విద్యార్థులకు తరగతి గదిలో అర్థం కాని అంశాలను కూడ వివిధ గేమ్స్, ఇంటారాక్టివ్ విధానాల ద్వారా సులభంగా అర్థం చేసుకునేలా ఈ వెబ్‌సైట్‌ను రూపొందించినట్లు రూపకర్త వివరించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం అధ్యక్షుడు మామిడి పూర్ణచంద్రరావు, ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఆర్థిక కార్యదర్శి రాంగోపాల్ రెడ్డితో పాటుగా జిల్లాలోని పలువురు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కొమురవెల్లిలో వైభవంగా గణపతి నవరాత్రి మహోత్సవాలు



**ప్రజాపక్షం/కొమురవెల్లి :** శ్రీ మల్లికార్జున స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న మహాగణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం వైదిక, ఆగమ శాస్త్రక్తంగా వివిధ పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. శ్రీ మల్లికార్జున స్వామివారి ప్రాతః కాల పూజ అనంతరం క్షేత్రపాలక పూజ నిర్వహించారు. అనంతరం మహాగణపతి స్వామివారి సన్నిధిలో ప్రధాన కలశ పూజలను శాస్త్రక్తంగా నిర్వహించారు. అనంతరం మహాగణపతి స్వామివారికి షోడశోపచార పూజలు, ఉత్తర పూజ నిర్వహించి కూష్మాండ బలిహరణ కార్యక్రమాన్ని చేపట్టారు. తదుపరి మహాగణపతి స్వామివారిని పల్లకిలో అధిష్ఠింపజేసి వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. మేళతాళాలు, ఒగ్గు పూజారుల డమరుక ధ్వనులతో సాగిన ఈ ఊరేగింపు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం శ్రీ స్వామివారి పుష్కరిణి కోనేరు వద్ద గంగా పూజ నిర్వహించి, త్రిశూల స్నానం, నిమజ్జనం, కంకణ విసర్జన కార్యక్రమాలను వైదిక సంప్రదాయాల ప్రకారం నిర్వహించారు. పుష్కరిణి కోనేరు నుంచి వెండి కుంభంలో పవిత్ర జలాన్ని తీసుకువచ్చి గర్భాలయంలోని శ్రీ మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం మహానీరాజనం, మహామంత్ర పుష్ప సమర్పణ కార్యక్రమాలు చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ మహోత్సవాల్లో ఆలయ అర్చకులు, సిబ్బంది, ఒగ్గు పూజారులు, ఆగమ పాఠశాల విద్యార్థులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌జిఎఫ్ క్రీడల్లో తిగుల్ విద్యార్థుల ప్రతిభ




**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** సిద్దిపేట జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించన జిల్లా స్థాయి ఎస్‌జిఎఫ్ అండర్ 14 క్రీడా పోటీలలో తిగుల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. అలాగే ఐదుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడాలో పాల్గొనే జట్టుకు ప్రాథినిధ్యం వహించనున్నారు. అలాగే బాలుర విభాగంలో వాలీబాల్ క్రీడాకారుడు సంతోష్ రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, పిఈటి రాజిరెడ్డికి టిపిటిఎఫ్ జగదేవ్‌పూర్ మండల శాఖ అధ్యక్షులు శంకర్ అభినందనలు తెలిపారు.

## ప్రవీణ్ యాదవ్‌ను పరామర్శించిన కాంగ్రెస్ నేత ప్రతాప్‌రెడ్డి



**ప్రజాపక్షం/కొమురవెల్లి :** కొమురవెల్లి దేవాలయ మాజీ ధర్మకర్త పయ్యావుల ప్రవీణ్ యాదవ్ తండ్రి ఇటీవల మృతి చెందడంతో జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి బుధవారం హైదరాబాద్ గాంధీనగర్‌లోని ప్రవీణ్ యాదవ్ నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబానికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమం లో కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్‌తో పాటు మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్ సబ్సిడీకి ఆధార్ బయోమెట్రిక్ తప్పనిసరి



**ప్రజాఫక్షం/సంగారెడ్డి :** గ్యాస్ సిలిండర్ సబ్సిడీకి ఆధార్ బయోమెట్రిక్ తప్పనిసరి ఆదారిత బయోమెట్రిక్ అథెంటిక్ పూర్తి చేయని కుటుంబాలకు అక్టోబర్ 1 నుంచి 14.2 కేజీల గృహ ఎల్పిజీ సిలిండర్‌పై సబ్సిడీ నిలిపివేయడనుంది. బిఏఏ పూరిత చేసే వరకు సబ్సిడీపై రీపిల్ బుక్ చేసుకునే అవకాశం ఉండదు. అయితే కనెక్షన్ రద్దు గ్యాస్ నిలిపివేత ఉండదు. అవసమరమైన 5 లేదా 10 కిజీల సిలిండర్లను మార్కెట్ ధరకు కొనుగోలు చేయవచ్చు. బిఏఏ పూర్తి చేసిన వెంటనే సబ్సిడీ రీపిల్ సౌకర్యం పునరుద్దిస్తారు. తెలంగాణలో 88 శాతం మంది బిఏఏ పూర్తి చేశారు.

## నేడు జిల్లాకు ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ బృందం

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** తెలంగాణ రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య, ఐదుగురు కమిషన్ సభ్యులతో కలిసి 24న సంగారెడ్డి జిల్లాలో పర్యటించనున్నట్లు షెడ్యూల్ట్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ టి. అఖిలేష్ రెడ్డి బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్బంగా 24న ఉదయం 1030 గంటలకు సంగారెడ్డి కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ మీటింగ్‌లో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమీక్షలో ప్రధానంగా ఎస్సీ ఎస్టీల భూసమ్యలు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీలకు సంబందించిన అంశాలు రోస్టర్ పాయింట్ల అమలు ప్రభుత్వ శాఖల్లో ఎస్సీ ,ఎస్టీ ఉద్యోగుల బ్యాకిలాగ్ ఖాళీల తదితర అంశాలపై సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు ,తమ శాఖలకు సంబందించిన రోస్టర్ పాయింట్ల అమలు బ్యాక్ లాగ్ ఖాళీలు తదితర అంశాలపై పూర్తి తాజా వివరాలతో సమీక్ష సమావేశానికి హాజరు కావాలని డిప్యూటీ డైరెక్టర్ కోరారు.

# భూములు కోల్పోయిన పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** జగ్గారెడ్డి కృషి తో భూముల కోల్పోయిన పేదలకు ఇళ్ల పట్టాల పంఫిణితో 13 ఏళ్ల నిరీక్షణకు తెర పడింది. ఏళ్ల తరబడి సొంతింటి స్థలం కోసం ఎదురుచూస్తున్న పేదల నిరీక్షణకు తెరబడింది. తొగరిపల్లి అలియాబాద్ గ్రామాలకు చెందిన భూములు కోల్పోయిన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తొగర్‌పల్లి సర్వే నెంబర్ 418లో మొత్తం 93 మంది లబ్ధిదారులకు 125 గజాల చొప్పున స్థలాలను కేటాయిస్తూ పట్టాలు అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలో గతంలో ఇళ్ల స్థలాల కోసం పట్టాలు పొందినప్పటికి త దనంతరం పరిణామాలతో లబ్ధిదారులకు స్థలాల పొజిషన్ అందకపోవడంతో సమస్య కొనసాగుతూ వచ్చింది. దీంతో తమకు కేటాయించిన స్థలాలను చూపించి సొంతింటి కలను సాకారం చేయాలని లబ్ధిదారులు పలు మార్లు అదికారులను ప్రజా ప్రతినిధులను కోరుతూ వచ్చారు. తొగరిపిపల్లి, అలియాబాద్ ప్రాంతల్లో భూములు కోల్పోయిన కుటుంబాలకు గతంలో ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియ చేపట్టారు. అయితే ప్రభుత్వం మారిన అనంతరం గతంలో జరిగిన కేటాయింపులు అమలులోకి రాకపోవడంతో లబ్ధిదారులు స్థలాల కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూడాల్సి వచ్చింది. ఈ సమస్యపై మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పలు మార్లు అసెంబ్లిలో ప్రస్తావించారు. ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కోసం మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి గత సంవత్సరం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలసి సమస్యలను వివరించారు. అనంతరం మంత్రి అప్పటి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతికి ఫోన్ చేసి లబ్ధిదారులకు పొజిషన్ చూపించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. తొగర్‌పల్లి సర్వే నెంబర్ 418 లో లబ్ధిదారులకు నిర్మల జగ్గారెడ్డి చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు సిడిసి చైర్మన్ రామ్‌రెడ్డి, కొండాపూర్ తహసీల్దార్ అశోక్ పాల్గొన్నారు.

## కార్యకర్తలను కాపాడుకుంటా

### మాజీ మంత్రి ఎర్రబెల్లి

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని పెద్దమడూరు గ్రామంలో ఇటీవల మృతిచెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గనుపాక శ్రీనివాస్, పానుగంటి సాయిలు, సుశీల, ఐలమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపి ఓదార్చారు. అదేవిధంగా పలు కుటుంబాలను ఆయన పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా పార్టీ నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి, శ్రీకాంత్ గౌడ్, మండల అధ్యక్షుడు దయాకర్, నాయకులు మల్లేష్, సోమసుందర్, రవి, ఉమేష్, కిషోర్‌కుమార్, నవీన్, సర్పంచ్ గిరి బాబు, రాములు, తదితరులు పాల్గొన్నారు.

**రైతులను పట్టించుకోని ప్రభుత్వం**

రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. బంజర గ్రామంలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలను ఆయన కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు సాగునీరు అందించే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని ఎర్రబెల్లి తెలిపారు. యూరియా కొరత, విద్యుత్ సమస్యలు, రుణ మాఫీ, తదితర అంశాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

## బిఆర్ఎస్ పార్టీలో ఎవరూ చేరలేదు

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** కాంగ్రెస్ పార్టీ నుండి బీఆర్ఎస్ పార్టీలో చేరారని బిఆర్ఎస్ పార్టీ నాయకులు పత్రిక ప్రకటన చేయడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ పార్టీ మండ అధ్యక్షులు నూకల ఐలయ్య, పిఎసిఎస్ చైర్మన్ తీగల కరుణాకర్ రావు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కెటిఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలో 300 మంది చేరారని పత్రికలో ఇవ్వడం చూస్తే జాలేస్తుందని అంతేగాకుండా తీగారం గ్రా మం నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు గత స ర్పంచ్ ఎన్నికల్లో పనిచేయకపోవడం వల్ల వారిని పక్కన పెట్టడం జరిగిందని అంతేగాని కాంగ్రెస్ పార్టీ కి వారికి ఎలాంటి సంబంధం లేదని వారు తెలిపారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎవరు బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఎవరో తెలుసుకుని ప్రకటన ఇవ్వాలన్నారు.

# జిల్లాస్థాయి కబడ్డీ క్రీడాకారుల ఎంపికలు

**ప్రజాపక్షం/పాపన్నపేట:** మండల కేంద్రమైన పాపన్నపేటలో జిల్లా స్థాయి జూనియర్, సబ్ జూనియర్, కబడ్డీ ఎంపికలు నిర్వహించారు. ఎంపికను పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్, స్థానిక సర్పంచ్ పావని నరేందర్ గౌడ్, హెచ్ఎం మహేశ్వర్ ప్రారంభించారు. ఈ పోటీలలో మెదక్ జిల్లా నుండి సుమారు 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరు రాష్ట్రస్థాయిలో సిరిసిల్లలో జరిగే కబడ్డీ పోటీలలో పాల్గొనున్నారు. ఇందులో 20 సంవత్సరాలలో బాల బాలికలు 24 మందిని ఎంపిక చేసినట్లు పాపన్నపేట ఫిజికల్ డైరెక్టర్ రమేష్ వెల్లడించారు. ఈ ఎంపిక కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కబడి అసోసియేషన్ సెక్రటరీ శివకుమార్ , సంగారెడ్డి జిల్లా నుండి ఎల్లయ్య, రిటైర్డ్ ప్రొఫసర్ ప్రభు, మెదక్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు రవి,కుమార్, సాయిలు, శ్రీకాంత్, ఉపేందర్, నికిత తదితరులు పాల్గొన్నారు. ఇందులో పాపన్నపేట చెందిన ఐదు గురు విద్యార్థులు ఎంపికయ్యారు.



## పటాన్‌చెరు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఘనంగా గురుపూజోత్సవం



**ప్రజాఫక్షం/పటాన్‌చెరు :** పటాన్చెరు నియోజకవర్గంలోని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం జిఎం ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా ప్రైవేటు పాఠశాలల గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో ఎంపికైన 200 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఈవెంటులో అత్యున్నతంగా సన్మానించారు. గూడెం మహిపాల్‌రెడ్డి ప్రసంగిస్తూ ఒక దేశ భవిష్యత్తు నిర్మాణం తరగతి నుండి మొదలవుతుందన్నారు. ప్రతి విద్యార్థినీ భావి భారత పౌరుడిగా తీర్చి దిద్దాల్సిన భాద్యత ప్రతి ఉపాధ్యాయుడి చేతిలో ఉందన్నారు. గత 25 సంవత్సరాలుగా గురుపూజోత్సవ వేడుకలను నిర్వహిస్తూ ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులను సన్మానించడం తన అదృష్టమన్నారు.ప్రత రంగంలో నియోజకవర్గానికి ప్రతిష్ట తెచే విదంగా విద్యార్థుల్ని తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. సాంకేతిక మొబైల్ వినియోగంపై అందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత సమాజంలో వాడకం ఎక్కువగా ప్రమాదకరంగా మారిందని టెక్నాలజీని మానవ ఎదుగుదలకు ఉపయోగించుకోవాలని దుర్వినియోగం సమాజానికి ముప్పు సృష్టిస్తుందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు తన తరగతిలోని ప్రతి విద్యార్థి చదువు, మానసిక ప్రవర్తనను శ్రద్దను గమనించాలని సూచించారు. కార్యక్రమానికి నియోజకవర్గ ప్రజాప్రతి నిదులు, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రైవేట్ పాఠశాలల సంక్షేమ సంఘం ప్రతినిదులు బారీ సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

### కలెక్టర్ ప్రతీక్ జైన్



**ప్రజాఫక్షం/సంగారెడ్డి :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నోటీసులు జారీ చేసిన ఓటర్ల నుంచి స్వీకరిస్తున్న ధ్రువపత్రాల పరిశీలన హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జౌన్ అధికారులను ఆదేశించారు. బుదవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశం మందిరంలో అడిషనల్ కలెక్టర్ సంగీతతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిదులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్కింగ్ కాని అనామలీ జాబితాలో ఉన్న ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబందించిన వారు సమర్పిస్తున్న ధ్రువపత్రాలను పరిశీలనను మరింత వేగవంతం చేయాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అదికారులను ఆదేశించారు. నోటీసులు ,అందుకున్న ఓటర్లు తమ వివరాల నిర్ధారణ కోసం 12 రకాల గుర్తింపు ధ్రువత్రాల్లో ఏదైనా ఒకదాన్ని సమర్పించాలని తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు హియరింగ్ కు హాజరై అవసరమైన ధ్రువపత్రాలు వివరాలను సమర్పించేఅల రాజకీయ పార్టీలు తమ బూత్ స్థాయి ఏజంట్ల ద్వారా అవగాహన కల్పించి సహకరించాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు ప్రజలు సహకరించాలని కలెక్టర్ కోరారు. జిల్లాలో మొత్తం 4,11,717 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయగా ఇప్పటి వరకు 2,48,395 మంది ఓటర్ల హియరింగ్ ప్రక్రియ పూర్తయినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా రాజీకీయ పార్టీల ప్రతినిధుల నుంచి సలహాలు, సూచనలు కలెక్టర్ స్వీకరించారు. హియరింగ్ ప్రక్రియకు సంబందించి ఎటువంటి సమస్యలు లేవని రాజకీయ పార్టీల ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ సంగీత సంబందిత అదికారులు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదతరులు పాల్గొన్నారు

## అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

**ప్రజాపక్షం/కొండాపూర్ :** కొండాపూర్ మండల పరిధిలోని దాదాపు పది సంవత్సరాలుగా జర్నలిస్టులుగా విధులు నిర్వహిస్తున్న అర్హులైన జర్నలిస్ట్‌లకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ టీజీఐఐసి చైర్మన్ నిర్మలా జగ్గరెడ్డి ,తహసీల్దార్ అశోక్, ,ఆత్మకమిటీ చైర్మే న్ ప్రభుకు వినతి పత్రం సమర్పించారు ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ దాదాపు పదేళ్లుగా ప్రజలకు ప్రభుత్వానికి మద్య వారదిగా పనిచేస్తు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో తమ వంతు బాద్యతను నిర్వర్తిస్తున్నాని తెలిపారు. తమ విజ్ఞప్తి న సానుకూలంగా పరిశీలించి అర్హులైన జర్నలిస్టులకుఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. మండలానికి చెందిన ఇతర మీడియా మిత్రులకు తొగర్పల్లి శివారులో ఇళ్ల స్థలాలు కేటాయించిన విదంగా ప్రస్తుతం అర్హులైన జర్నలిస్టులకు కూడా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

## భారతీయ కిసాన్ సంఘ్ జెండావిష్కరణ

**ప్రజాపక్షం/కొండాపూర్ :** కొండాపూర్ మండలం గొల్లపల్లి గ్రామంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పరియాద రామకృష్ణారెడ్డి ఆద్వర్వయంలో బుదవారం కిసాన్ సంఘ్ జెండావిష్కరించారు. ఈ సందర్భంగా రామ కృష్ణ రెడ్డి మాట్లాడుతూ రైతులు పార్టీలకు అతీతంగా ఉండి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని వ్యవసాయానికి నిరంతరంగా 18 గంటల కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు గడీల రామాగౌడ్, గ్రామ సర్పంచ్ గడీల శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, బంటు నర్సింలు, వెంకటేష్‌గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, దేవిరెడ్డి మహిళా రైతులు గ్రామస్థులు పాల్గొన్నారు.

## రేగోడ్ — సదాశివపేట్ బస్సులు పునరుద్ధరించాలి

**ప్రజాపక్షం/రేగోడ్:** మండల కేంద్రంలోని రేగోడ్ —నారాయణఖేడ్ డిపోకు చెందిన బస్సు రేగోడ్, వట్టిపల్లి, సదాశివపేట్ బస్సులు పునరుద్ధరించాలని రేగోడ్ ప్రజలు కోరుతున్నారు ఇటీవల బస్సు సక్సెస్ ఫుల్ గా కొనసాగుతున్న గత వారం రోజులుగా నిలిపివేశారని రేగోడు గ్రామ ప్రజలు అంటున్నారు రేగోడు వట్టిపల్లి సదాశివపేట వెళ్లడానికి విజయవంతంగా కొనసాగుతుందని మార్గమధ్యంలో నిలిపివేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉన్నతాధికారులు స్పందించి రేగోడ్– సదాశివపేట బస్సు ప్రారంభించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు

## నిమజ్జనాలు ప్రశాంతంగా జరుపుకోవాలి: ఎస్ఐ పోచయ్య

**ప్రజాపక్షం/రేగోడ్:** గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిమజ్జనాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ పోచయ్య అన్నారు బుధవారం రేగోడ్ వినాయకుడిని దర్శించుకున్నారు గణేష్ మంటపం వద్ద రేగోడ్ మాజీ పిఎస్ ఎస్ చైర్మన్ శ్యామ్ రావు, పి ఎస్ డైరెక్టర్ నాగేందర్, దత్తు కులకర్ణి, ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు ప్రసాద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై పోచయ్య మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో పిఎస్సిఎస్ వైస్ చైర్మన్ రాధా కిషన్, సంగమేశ్వర్, రామాగౌడ్, మచ్చేందర్ రావు, నాగరాజు, అనిల్,అంజనేయులు,తదితరులు పాల్గొన్నారు

## గణపతుల నిమజ్జన చెరువును పరిశీలించిన డిసిపి

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** మండల కేంద్రంలోని గణపతుల నిమజ్జనం చేసే గుడి చెరువును వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, వర్ధన్నపేట ఎసిపి అంబటి నరసయ్య, పాలకుర్తి సీఐ భరత్ సుమన్, దేవరుప్పుల ఎస్ఐ ఊర సృజన్ కుమార్, అధికారులు సందర్శించారు. నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జనం చేసే చెరువు వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా భారీ కేడింగ్ ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బందోబస్తు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. నిమజ్జనం కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని, పోలీసు సిబ్బందికి, అధికారులకు సూచించారు.



## తబితా ఆశ్రమంలో అన్నదానం

ప్రజాపక్షం/రామగుండం : రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పుట్టిన రోజు పురస్కరించుకొని పట్టణంలోని తబితా ఆశ్రమంలో బీఆర్ఎస్ పట్టణశాఖ అధ్యక్షుడు బొద్దుపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కేక్ కట్ చేసి చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాడిశెట్టి రవీందర్, ఉప్పరి లక్ష్మణ్, ఈదునూరి నర్సింగ్, ఆశాది వేణుగోపాల్, కత్తరమల్ల నర్సింగ్, అర్శనపల్లి రాజు, మాచర్ల నరేష్, ఖలీల్‌పాషా, జగన్మోహన్ రావు, అంతర్గాం మండల నాయకులు కరివేద శ్రీనివాస్‌రెడ్డి, కాంపెల్లి సంతోష్, ఆవునూరి రాజేష్, గుమ్ముల నవీన్, ఆవునూరి ప్రశాంత్‌లు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/అంతర్గాం : పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోల సంతోష్‌గౌడ్ ఆధ్వర్యంలో రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ జన్మదిన వేడుకలను బుధవారం నిర్వహించారు. కేక్ కట్ చేసి ప్రజలకు మిఠాయిలు పంచారు. బాణా సంచా కాల్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్వచ్ఛత హిసేవపై అవగాహన

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట : మండలంలోని వెంకటపూర్ గ్రామంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ మెడిశెట్టి పద్మ బాలయ్య పరిశీలించారు. బుధవారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంని సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యహ్న భోజన పథకం తీరు పరిశీలించి, నాణ్యమైన భోజనం అందేలా చూడాలని, అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొట్టె శ్రీకాంత్, కార్యదర్శి కరుణాకర్, వార్డు సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



# 27న 'చలో యాదగిరిగుట్ట'ను జయప్రదం చేయండి

మంథని నియోజకవర్గ ఉద్యమకారుల ఫోరం పిలుపు



ప్రజాపక్షం/ముత్తారం : ఈ నెల 27న యాదాద్రి (యాదగిరిగుట్ట)లో నిర్వహించనున్న 9వ తెలంగాణ ఉద్యమకారుల వార్షికోత్సవ మహాసభను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని ఉద్యమకారుల ఫోరం నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం మంథనిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు మంథని విజయ్ కుమార్, మంథని సాయికుమార్, బండారి సుధాకర్ మాట్లాడారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో మంథని ప్రాంతానికి ప్రత్యేక చరిత్ర ఉందన్నారు. ఈ సభకు మంథని నియోజకవర్గం నుండి ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలు భారీ సంఖ్యలో తరలి రావాలని విజ్ఞప్తి చేశారు.తెలంగాణ సిద్ధించి ఇన్నేళ్లవుతున్నా ఉద్యమకారుల గుర్తింపు,సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.యాదగిరిగుట్ట సభకు వచ్చే ప్రతి ఒక్క ఉద్యమకారుడు గతంలో తాము చేసిన పోరాటాలు,జైలు జీవితం,కేసులకు సంబంధించిన పూర్తి ఉద్యమ ఆధారాలను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని ఈ సందర్భంగా నేతలు సూచించారు. భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకోవడానికి ఈ సదస్సు ఎంతగానో ఉపయోగపడుతుందని,నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.

# అట్టహాసంగా ఆధ్యాత్మిక శోభ.. అన్నదాన కార్యక్రమాలు



ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల వ్యాప్తంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా ముగిశాయి.ఉత్సవాల ముగింపు సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లోని గణనాథుని మండపాల వద్ద భారీ అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.ఈ అన్నదాన కార్యక్రమాల్లో కులమతాలకు,రాజకీయ పార్టీలకు అతీతంగా గ్రామస్తులందరూ ఏకమై,మమేకమై పాల్గొన్నారు.ఆయా గ్రామాల సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు అందరూ కలిసికట్టుగా భక్తులతో పాటు కూర్చుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.అన్నదాన కార్యక్రమాల అనంతరం భక్తుల జయజయధ్వానాలు,కోలాటాలు,డప్పు వాయిద్యాల నడుమ వినాయక విగ్రహాల నిమజ్జన మహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనడంతో భక్తులు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

# టికె. రమేష్ అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది



ప్రజాపక్షం/సుల్తానాబాద్ : సుల్తానాబాద్ టీవీ9 & సిటీ కేబుల్ సీనియర్ పాత్రికేయులు టి.కే రమేష్ అకాల మరణం తనని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు అన్నారు. రమేష్ మరణ వార్త తెలియగానే సుల్తానాబాద్‌లోని వారి నివాసానికి వెళ్లి రమేష్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలియజేశారు. రమేష్ అకాల మరణం తనని తీవ్రంగా కలిసి వేసిన రమేష్ కుటుంబ సభ్యులకు అన్నివిధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.నివాళులు అర్పించిన వారిలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్,మార్కెట్ చైర్మన్ మినిపాల ప్రకాష్ రావు,కౌన్సిలర్లు మీడియా మిత్రులు,కాంగ్రెస్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# లక్కీ డ్రాలో లడ్డు గెలుచుకున్న పాత్రికేయుడు

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : సుల్తానాబాద్ మండల కేంద్రంలోని జవహర్ నగర్ కాలనీలో భవాని యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపంలో బుధవారం తీసిన లక్కీ డ్రాలో ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన పాత్రికేయుడు ముతికెల శ్రీధర్ ఐదు కేజీల లడ్డూను గెలుపొందారు. నవరాత్రుల్లో ఉత్సవ భరిత వాతావరణం లో విశేష పూజలు అందుకున్న గణేశుని చేతిలో నైవేద్యంగా పెట్టిన లడ్డు ఎలాంటి తారతమ్యాలు లేకుండా భక్తులకు అందాలనే ఉద్దేశంతో ఉత్సవ కమిటీ నగదు కూపన్లను రాయించి లక్కీ డ్రా తీసినట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఈ సందర్భంగా తెలిపారు.గణేషుడికి విశేష పూజలు చేసిన అనంతరం లక్కీ డ్రాలో లడ్డు గెలుచుకున్న శ్రీధర్ కు ఉత్సవ కమిటీ సమక్షంలో లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటి అధ్యక్షులు ఆకుల కరుణాకర్,ఆకుల అం జ య్య, భవాని యూత్ క్లబ్ సభ్యులు ఆ కుల విష్ణువర్ధన్, డి .మధు, కొయ్యడ,సాయి,శివకుమార్ ,ఆకుల సందీప్ ,ఆకు ల జయవర్ధన్, శెట్టి శ్రీనివాస్,దేవాన ంద ,సాయికిరణ్, పూ జా రి ,సాయినాథ్ ఇతర యూత్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## డిజె బాక్స్‌ల విరాళం



ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని కమ్మరిపల్లె యూత్ సభ్యులు ఏర్పాటు చేసిన గణేశ్ మండపానికి మాజీ జెడ్పీటీసీ నాగినేని జగన్‌మోహన్ రావు రూ.10,000,ముత్తారం మాజీ సర్పంచ్ తాటిపాముల వకుళాభరణశంకర్ దంపతులు రూ.10,000 చొప్పున మొత్తం రూ.20,000 ఆర్థిక సహాయం అందజేశారు.గణేశ్ మండపం వద్దకు డీజే బాక్స్ ల కోసం నగదును అందజేశారు.ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ..గణేశ్ ఉత్సవాల నిర్వహణకు తమకు ఆర్థిక సహాయం అందించిన మాజీ జెడ్పీటీసీ జగన్‌మోహన్ రావు,మాజీ సర్పంచ్ తాటిపాముల వకుళాభరణశంకర్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.తమకు అండగా నిలిచి ఉత్సవాల నిర్వహణకు సహకరించడం సంతోషంగా ఉందన్నారు.అందరి సహకారంతో గణేశ్ ఉత్సవాలను ఘ నం గా,భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ముత్తారం మండల వార్డు సభ్యులకు ఫోరం అధ్యక్షులు కుక్కల చంద్రమౌళి తో పాటు పలువురు పాల్గొన్నారు.

# గణనాథుడి నిమజ్జన వేళ భక్తులకు నిరాశ

ప్రజాపక్షం/ముత్తారం :పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలో బుధవారం కురిసిన భారీ వర్షం గణేష్ నిమజ్జన వేడుకలపై నీళ్లు చల్లింది.తొమ్మిది రోజుల పాటు అత్యంత వైభవంగా,భక్తిశ్రద్ధలతో జరిగిన గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు వేళ వర్షం ముంచెత్తడంతో భక్తులు తీవ్ర నిరాశకు గురయ్యారు.మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం నుంచి నిమజ్జన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు,భక్తులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు.స్వామివారిని సాగనంపేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయి భారీ వర్షం కురిసింది.ఊహించని ఈ వర్షంతో నిమజ్జన ఊరేగింపులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.తొమ్మిది రోజుల పాటు కోలాహలంగా సాగిన ఉత్సవాల ముగింపు వేళ వర్షం కురవడంతో, వేడుకలను అనుకున్న రీతిలో జరుపుకోలేకపోయామని భక్తులు విచారం వ్యక్తం చేశారు.వర్షం కారణంగా పలు చోట్ల నిమజ్జన కార్యక్రమాలు ఆలస్యంగా సాగాయి.

# మంత్రి శ్రీధర్ బాబుకు విద్యార్థి నాయకుల కృతజ్ఞతలు

ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పట్టణానికి వెలుపల మల్లెపల్లి సమీపంలో ఉండటంతో విద్యార్థిని, విద్యార్థులు కళాశాలకు వెళ్లేందుకు,తిరిగి రావడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విద్యార్థి నాయకుడు బెజ్జంకి దిగంబర్ తెలిపారు.విద్యార్థులు ఎదుర్కొంటున్న ఈ సమస్యను ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సంబంధిత విద్యాశాఖ అధికారులకు సూచనలు ఇచ్చినట్లు తెలిపారు.మంత్రి ఆదేశాల మేరకు మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంథని హైస్కూల్‌లోకి,బాలుర జూనియర్ కళాశాలను కాలేజ్ గ్రౌండ్‌లోకి మార్చేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.విద్యార్థుల రాకపోకలకు సంబంధించిన సమస్యను పరిష్కరించేందుకు స్పందించిన మంత్రి శ్రీధర్ బాబుకు విద్యార్థి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.అలాగే ఈ సమస్య పరిష్కారానికి సహకరించిన మంథని మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్,వైస్ చైర్మన్ సహిందర్ రెడ్డి,కౌన్సిలర్ ఎల్లంకి వంశీతో పాటు మున్సిపల్ పాలకవర్గానికి బెజ్జంకి దిగంబర్ కృతజ్ఞతలు తెలిపారు.

# క్లబ్ సభ్యులకు సన్మానం



ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంలో నూతన ప్రెస్ క్లబ్ ఏర్పాటు అయిన సందర్భంగా అయ్యప్ప దీక్షా సేవా సమితి ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ సభ్యులను ఘనంగా సన్మానించారు. ప్రధాన అర్చకులు గుండయ్య శర్మ, పందిర్ల శ్రీనివాస్ గురు స్వామి పూజలు చేసి ఆశీర్వచనం అందించారు. అనంతరం సభ్యులకు శాలువలు కప్పి ఆత్మీయ సన్మానం చేశారు. కార్యక్రమంలో చకిలం మధు, చింత రాజు, కోల బాపురెడ్డి, దూస శ్రీనివాస్, మాదాసు నాగరాజు, గంట కిరణ్, మంగళ శ్రీనివాస్ రెడ్డి, నిమ్మ దేవరెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# వైన్స్, కల్లు డిపోల బంద్



ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంతో పాటుగా అన్ని గ్రామాల్లో ఉన్న మద్యం షాపులు రెండు రోజులు ఎల్లారెడ్డిపేట ప్రొహిబిషన్ అధికారులు బంద్ చేయించారు. బుధవారం సిఐ రేండ్ల విజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నారాయణపూర్, గొల్లపల్లి, బొప్పాపూర్‌తో పాటుగా అన్ని మద్యం దుకాణాలు, కల్లు దుకాణాల స్టాక్ రిపోర్టును చెక్ చేసుకొని సీల్ చేశారు. గణేష్ నిమజ్జన ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జర కుండా, శాంతియుత వాతావరణంలో జరుపుకునేలా రెండు రోజులుపాటు మద్యం సరఫరాను నిలిపి వేస్తున్నట్లు సిఐ పేర్కొన్నారు. వారి వెంట హెడ్ కానిస్టేబుల్ మోసిన్, ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.